epaper.samayamdaily.net

APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 32 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 8 నవంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131




## 2026లో భారత్‌లో పర్యటిస్తా

- ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు
- వాణిజ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

4




## వందేమాతరంతో ఆత్మవిశ్వాసం

- అది భవిష్యత్‌కు సరికొత్త భరోసా
- స్ఫూర్తి నింపిన వందేమాతరం
- వందేమాతరం 150వ స్మారకోత్సవంలో ప్రధాని మోదీ

2



## వీరు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారు?

- సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌పై కమిషనర్ ఆగ్రహం

02

# ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

## విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటారా

- బంద్ పెట్టి బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తానంటే ఎలా
- విద్యార్థుల అకడమిక్ ఇయర్ లాస్‌కు ఎవరు బాధ్యులు
- ఫీజులు ఇష్టానుసారం పెంచి రియంబర్స్‌మెంట్‌పై ఒత్తిడి
- రాజకీయ పార్టీల ఉచ్చులో పడి బెదిరిస్తే ఊరుకునేది లేదు
- ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై సిఎం రేవంత్ ఘాటు హెచ్చరికలు



**హైదరాబాద్, నవంబరు 7:** ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. శుక్రవారం గాంధీ భవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరిం చారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్ మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చలు ఎలా ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రభుత్వం వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి.

మిగతా 2 లో



## జూబ్లీహిల్స్‌లో అధికార దుర్వినియోగం

- కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఆయన కేబినెట్ సహచరులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆయన ఆరోపించారు.

02



## కావేరీ ట్రావెల్స్ ఓనర్ వేమూరి వినోద్ అరెస్ట్

- బస్సు ప్రమాదం కేసులో కీలక పరిణామం

02

## కిషన్ రెడ్డి, కేటీఆర్ బ్యాడ్ బ్రదర్స్!

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ కేటీఆర్ తెలంగాణ పాలిట బ్యాడ్ బ్రదర్స్ లా దాపురించారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి బంధం కొనసాగుతుందని ఎద్దేవా చేశారు.

- ఇద్దరు కలిసి మెట్రో విస్తరణకు అడ్డంకులు
- హైదరాబాద్‌అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- పదేండ్లలో కేసీఆర్‌కిలో మీటర్‌మెట్రో విస్తరించారా?
- తెలంగాణకు బీజేపీ, బీఆర్ఎస్‌చేసింది శూన్యం
- సీఎం రేవంత్‌రెడ్డి హాట్‌కామెంట్స్

02





## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర

- రేవంత్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- బకాయిలు చెల్లించకుంటే చదువెలా సాగిస్తారు
- ప్రైవేట్ కాలేజీలకు మా మద్దతు కొనసాగిస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి

02



# రైతులకు అండగా ప్రభుత్వం

## పంట నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి సాయం

- బీమా ప్రీమియం చెల్లించి రైతులను ఆదుకున్నాం
- పంటలకు గిట్టుబాటు ధరలు వచ్చేలా ప్రత్యేక చర్యలు
- పంటలకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరా
- రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేసేలాచర్యలు
- కరువును శాశ్వతంగా తరిమేలా ప్రణాళికలు
- ఎన్జీ రంగా జయంతి వేడుకల్లో సీఎం చంద్రబాబు

**గుంటూరు :** రాష్ట్రంలో ఏ ఒక్క రైతూ అధైర్యపడొద్దు.. ఆత్మహత్యలు చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. తుఫాను ప్రభావంతో పంటలు నష్టపోయిన కౌలు రైతులకు పెట్టుబడి రాయితీ ఇస్తున్నావ ఓని తెలిపారు. పంటల బీమా ప్రీమియం కూడా జగన్ ప్రభుత్వం చెల్లించలేదని ధ్వజమెత్తారు. దీంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ

మిగతా 5 లో

## విమెన్ క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు పురస్కారం

- గ్రూప్ 1 ఉద్యోగంతోపాటు.. కడపలో ఇంటి స్థలం
- సీఎం చంద్రబాబుతో భేటీ అయిన శ్రీచరణి, మిథాలీ
- క్రికెటర్లను అభినందించిన సీఎం చంద్రబాబు, లోకేశ్
- గన్నవరం ఎయిర్‌పోర్టులో మంత్రుల ఘనస్వాగతం

వివరాలు 5వ పేజీలో



## తెలంగాణ ఆర్థిక పాలనలో పట్టు తప్పిందా!?

- బకాయిల మోత, ఆదాయానికి గండం



10




# ప్రైవేట్ కాలేజీల సమాఖ్యకు చుక్కెదురు

**అధ్యాపక సభకు అనుమతి ఇవ్వలేమన్న హైకోర్టు**

**హైదరాబాద్,నవంబరు 7:** ఉన్నత విద్యా సంస్థల సమాఖ్యకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. హైదరాబాద్‌లో శనివారం నిర్వహించే అధ్యాపక సభకు అనుమతి నిరాకరించింది న్యాయస్థానం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఉన్నందున సెక్యూరిటీ ఇవ్వలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో అధ్యాపక సభ అనుమతి కోసం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. ఈ పిటీషన్‌పై జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారణ జరిపారు. అధ్యాపక సభకు ఎల్బీ స్టేడియం లేదా మరోచోట అయినా ఫర్లేదని అనుమతి ఇవ్వాలని సమాఖ్య లాయర్ కోరారు. అయితే, కాలేజీల బంద్‌ని రాష్ట్ర సర్కార్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది హైకోర్టు. ఈ సభకు అనుమతి ఇవ్వడానికి ఉన్న అభ్యంతరం ఏంటని న్యాయస్థానం ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పక్రియ ముగిసే వరకు హైదరాబాద్ సిటీలో భారీ సభకు అనుమతి ఇవ్వలేమని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో అధ్యాపక సభకు వారం రోజుల తర్వాత అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారు?

**సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌పై కమిషనర్ ఆగ్రహం**



**హైదరాబాద్, నవంబరు 7:** ప్రజాభిమానాన్ని వ్యాపారంగా మలచుకోవడం దారుణమని క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్‌ధావన్‌పై హైదరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెట్టింగ్ యాప్‌లకు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉంటూ వీరు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకున్నారని మండిపడ్డారు. ప్రేక్షకుల అభిమానాన్ని సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారని ప్రశ్నించారు. బెట్టింగ్ మహమ్మారికి ఎందరో యువకులు బలవుతున్నారు. వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సమాజాన్ని ఛిద్రం చేస్తోన్న బెట్టింగ్ భూతాన్ని ప్రచారం చేసిన వీరు వీటన్నింటికీ బాధ్యులు కారా అని అన్నారు. సమాజ మేలు కోసం, యువత ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి నాలుగు మంచి మాటలు చెప్పండి. అంతే కానీ మిమ్మల్ని అభిమానించే వాళ్లను తప్పుదోవ పట్టించి.. వారి ప్రాణాలను తీయకండి అని ఎక్స్‌లో సజ్జనార్ పోస్టు పెట్టారు.

# కావేరీ ట్రావెల్స్ ఓనర్ వినోద్ అరెస్ట్



**కర్నూలు, నవంబరు 7:** తెలుగు రాష్ట్రాల్లో పెను ప్రకంపనలు సృష్టించిన వేమూరి కావేరీ ట్రావెల్స్ బస్సు ప్రమాదం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కర్నూలు జిల్లాలో 19 మంది మృతికి కారణమైన ఈ ఘోర ప్రమాదానికి సంబంధించి వి. కావేరీ ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో బస్సు డ్రైవర్ మిర్యాల లక్ష్మయ్యను ఎ1 నిందితుడిగా ఇప్పటికే అరెస్టు చేయగా, ట్రావెల్స్ యజమాని వినోద్ కుమార్‌ను ఎ2 నిందితుడిగా పోలీసులు చేర్చారు. ప్రయాణికుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు జిల్లాలోని ఉలిందకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ట్రావెల్స్ ఓనర్ వినోద్ కుమార్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు శుక్రవారం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు వినోద్ కుమార్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఈ బస్సు కర్నూలు జిల్లా, ఉలిందకొండ మండలం చిన్నటేకూరు క్రాస్ రోడ్డు వద్ద ఒక బైకును ఢీకొనడంతో మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 19 మంది సజీవ దహనమయ్యారు. పోలీసుల ఈఎఫ్‌ఐ కాపీ ప్రకారం డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు స్పష్టం చేశారు. డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై ఉలిందకొండ పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# జూబ్లీహిల్స్‌లో అధికార దుర్వినియోగం

**కేంద్ర ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు**



**న్యూఢిల్లీ, నవంబరు 7:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ముఖ్యమంత్రితోపాటు ఆయన కేబినెట్ సహచరులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆ యన ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని.. ఈ నేపథ్యంలో కేంద్ర బలగాల ఆధ్వర్యంలో ఈ ఉపఎన్నికను నిర్వహించాలని ఈసీని కోరినట్లు ఆయన తెలిపా రు. శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారులతో బీఆర్ఎస్ ఎంపీ లు కెఆర్ సురేష్ రెడ్డి, దామోదర్ రావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ అగ్రనేతలు వ్యవహరిస్తున్న తీరును వారికి వివరించి.. ఫిర్యా దు చేశారు. అనంతరం విలేకర్లతో ఎంపీ కె.ఆర్.సురేష్ రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని.. దాంతో అక్కడ మహిళా అధికారులను నియమించాలని సీఈసీని కోరినట్లు తెలిపారు. అలా కాకుంటే దొంగ ఓట్లు వేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు.

# కిషన్ రెడ్డి, కేటీఆర్ బ్యాడ్ బ్రదర్స్!

- ఇద్దరు కలిసి మెట్రో విస్తరణకు అడ్డంకులు
- హైదరాబాద్‌అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- పదేండ్లలో కేసీఆర్‌కిలో మీటర్ మెట్రో విస్తరించారా?
- తెలంగాణకు బీజేపీ, బీఆర్ఎస్ చేసింది శూన్యం
- సీఎం రేవంత్‌రెడ్డి హాట్‌కామెంట్స్



**హైదరాబాద్, నవంబర్7:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ కేటీఆర్ తెలంగాణ పాలిట బ్యాడ్ బ్రదర్స్ లా దాపురించారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి బంధం కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ కేటీఆర్ లపై తీవ్రమైన ఆరోపణలు గుప్పించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు ఒకటే సూచన చేయదలచుకున్నట్లు తెలిపారు. 2004 నుంచి 2014 వరకు పదేళ్లు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉందన్నారు. 2014 నుంచి 2023 వరకు రాష్ట్రంలో బీఆరెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని గుర్తు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభివృద్ధిని పోల్చి చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ లో అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్, మెట్రో, నాలెడ్జ్ సెంటర్స్, ఐటీ, ఫార్మా ఇలా% అన్ని రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ బీజం వేసిందని గుర్తు చేశారు. ఐటీఐఆర్ హైదరాబాద్ రాకుండా చేసింది బీఆర్ఎస్‌లు, బీజేపీ కాదా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ తీసుకున్న ప్రణాళికలతోనే హైదరాబాద్ ఆదాయం పెరిగిందన్నారు. వరదల్లో హైదరాబాద్ మునిగిపోతే కిషన్ రెడ్డి కేంద్రం నుంచి చిల్లిగవ్వ తీసుకురాలేదన్నారు. సచివాలయంలో ఆలయం కూల్చేస్తే కిషన్ రెడ్డి స్పందించలేదన్నారు. కాళేశ్వరం కట్టి లక్ష కోట్లు గోదావరి పాలు చేశారన్నారు. ప్రగతి భవన్ కేసీఆర్ కు, ఆయన కుటుంబానికి మాత్రమే ఉపయోగపడిందన్నారు. కొడుకు కోసం వాస్తు సరిద్దడానికి ఉన్న సచివాలయాన్ని కూల్చి కొత్తది కట్టిండన్నారు. సచివాలయం నిర్మిస్తే ఎవరికైనా ఉద్యోగాలు వచ్చాయా? ఎవరికైనా పనికొచ్చిందా అంటూ బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. పేద ప్రజలకు ఆ సచివాలయంతో ఏమైనా ప్రయోజనం ఒనగూరిందా అంటూ బీఆర్ఎస్‌పై ఆరోపణలు గుప్పించారు. ఫోన్ ట్యాపింగ్ కోసం కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసుకున్నారన్నారు. సద్దాం హుస్సేన్ లా ప్రాణభయంతో తనను తాను కాపాడేందుకు ప్రగతి భవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ బాత్రూమ్‌లు కట్టుకున్నాడన్నారు. అదే విధంగా 8 లక్షల 11 వేల కోట్ల అప్పుతో మాకు రాష్ట్రాన్ని అప్పగించారన్నారు. ఆనాడు కాంగ్రెస్ ఏర్పాటు చేసిన విద్యా సంస్థలే మనకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఐటీఐఆర్ ను రద్దు చేయడం తప్ప వీళ్లు ఒక్క అదనపు ఎయిర్ పోర్టునైనా తెచ్చారా అంటూ గత పాలనను ఏకీపారేశారు. పదేళ్లలో మెట్రోను ఒక కిలోమీటరైనా విస్తరించారా? అంటూ ప్రశ్నలు వేశారు. నగర విస్తరణతో పాటు మెట్రో విస్తరణ ఎందుకుచేయలేదని, కాంగ్రెస్ మొదలు పెట్టిన సాగునీటి ప్రాజక్టులను పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదన్నారు. పదేళ్లలో 20లక్షల కోట్ల బడ్జెట్‌ను ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ నిర్మించిన ఔటర్ రింగ్ రోడ్డును కూడా అమ్ముకున్నారన్నారు. పదేళ్ల కోసం కొత్త ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ తయారు చేసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ నగర ప్రజల కోసం పరితపించిన పీజేఆర్, శశిధర్ రెడ్డిని హైదరాబాద్ బ్రదర్స్ అనేవారని.. ఇప్పుడు కిషన్‌రెడ్డి, కేటీఆర్‌ను బ్యాడ్ బ్రదర్స్ అంటున్నారని తూర్పార బట్టారు. మెట్రో, గోదావరి జలాలు, ఎలివేటెడ్ కారిడార్లు, ఫ్యూచర్ సిటీని బ్యాడ్ బ్రదర్స్ అడ్డుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రజలకు ఉపయోగంలేని ప్రగతి భవన్, కాళేశ్వరం, కమాండ్ కంట్రోల్, సచివాలయం చూపించి ఇంకా ఎన్నాళ్ళు కాలం గడుపుతారని బీఆర్ఎస్ పై ఆరోపణలు గుప్పించారు. కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లు దండుకుని దోచుకున్నారు తప్ప ప్రజలకు ఉపయోగపడే పని చేశారా? అని ప్రశ్నించారు. కేటీఆర్ తీసుకొచ్చింది కేవలం గంజాయి, డ్రగ్స్ మాత్రమేనన్నారు. మీ బావమరిది బావమరిది డ్రగ్స్ తీసుకుని దొరికింది నిజం కాదా? అంటూ ఫైర్ అయ్యారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన మీరు చేసిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా చూపించాలన్నారు. నగర అభివృద్ధిపై బ్యాడ్ బ్రదర్స్ ఇద్దరూ ఎక్కడ చర్చకు వచ్చినా మేం సిద్ధంగా ఉన్నామన్నారు. నగరాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రజా ప్రతినిధుల సహకారం ఉండాలన్నారు. అందుకే జూబ్లీహిల్స్ గెలవాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని 695 చెరువులలో 44 చెరువులను బీఆర్ఎస్ కబ్జా చేసిందన్నారు. మీరు ఆక్రమించుకున్న చెరువులను విధించినందున హైడ్రా పై విషం చిమ్ముతున్నారన్నారు. బతుకమ్మ కుంటను ఆక్రమించుకున్న ఎడ్ల సుధాకర్ రెడ్డి ఎవరు బీఆర్ఎస్ కాదా? అంటూ ప్రశ్నించారు. సున్నం, నల్ల చెరువును ఆక్రమించుకుంది నిజం కాదా.. అంటూ ఫైర్ అయ్యారు. వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ నిర్మించి నగరంలో రోడ్లపై నీళ్లు నిలవకుండా చేసింది హైడ్రా కాదా? ఈగల్ ఫోర్స్, హైడ్రా పై కేటీఆర్ కక్ష పెట్టుకున్నాడన్నారు. హైడ్రా ఎక్కడ తప్పు చేసిందో చెప్పు నిజ నిర్ధారణ కమిటీ వేద్దామన్నారు. కేసీఆర్ కుటుంబంతో ఉండే వాళ్ళందరినీ హరీష్ బీఆర్ఎస్ నుంచి బయటకు పంపేశారన్నారు. ఇప్పుడు ఇంట్లో కవితను కూడా బయటికి పంపేలా చేశారన్నారు. వీళ్లా తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడేది అని ఫైర్‌అయ్యారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల తాట తీస్తా

మొదటి పేజీ తరువాయి



లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు చేపట్టిన బంద్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. విడతల వారీగా బకాయిలు చెల్లిస్తామన్నారు. మా హయాంలోని బకాయిలు ముందు చెల్లిస్తాం గతంలో ఉన్న బకాయిలపై చర్చిస్తామని అన్నారు.అయితే బందులతో విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడొద్దన్నారు. ఇలా చేయడం విద్యార్థులపై ప్రభావం చూపదా అని అన్నారు. బకాయిలు ఇవాళ కాకపోతే రేపు వసూలవుతాయి. కాలేజీలు బంద్ పెడితే విద్యార్థులు కోల్పోయిన సమయం తిరిగి వస్తుందా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులకు ఇబ్బంది లేదు. అన్ని వర్గాలను సమన్వయం చేసుకుంటూ వెళ్లాలి. రాష్ట్రానికి నెలకు రూ.18వేల కోట్ల ఆదాయం వస్తోంది. జీతాలు, వడ్డీలు, ఇతర ఖర్చులు పోనూ మిగిలేది రూ.5వేల కోట్లే. ఈ ఆదాయంతో రాష్ట్రాన్ని ఎలా నడపాలో చెప్పండి. ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా? కాలేజీలను బంద్ చేయించినవారితో చర్చించేదేముంది? ఏ కాలేజీ ఎంత డొనేషన్ వసూలు చేస్తుందో నాకు తెలుసు. కాలేజీలో నిబంధనలు పాటించకపోతే ఎలా? ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటూ పోతే ఎలా? విద్య వ్యాపారం కాదు.. విద్యను సేవగా భావించాలి. రాజకీయ నేతలు అండగా ఉన్నారని విద్యార్థులతో ఆడుకోవద్దు. అడ్డగోలుగా ఫీజులు పెంచుకుని వచ్చి రీయింబర్స్‌మెంట్ అడుగుతున్నారు. కాలేజీలకు అనుమతుల విషయంలో ఎన్నో అక్రమాలు ఉన్నాయి. కాలేజీల యజమానులు ప్రభుత్వాన్నే బ్లాక్ మెయిల్ చేస్తారా? బీసీ నేత ఆర్.కృష్ణయ్య కూడా అమాయకంగా వాళ్ల ఉచ్చులో పడ్డారు. ఆర్.కృష్ణయ్య, మందకృష్ణ ముందుకొస్తే వాళ్ల చేతికే చిట్టా ఇస్తా. నాలుగు నెలలు ప్రభుత్వాన్ని మీరే నడపండని సీఎం అన్నారు.

# ఢిల్లీతోపాటు ముంబైలో సాంకేతిక సమస్య

**విమానాల రాకపోకల్లో తీవ్ర అంతరాయం**

**ముంబై,నవంబరు7 :** సాంకేతిక సమస్య కారణంగా ఢిల్లీలో వందలాది విమానాల రాకపోకలపై ప్రభావం పడింది.ఇప్పుడు ముంబయిలోనూ అదే పరిస్థితి ఎదురైంది. ఈ మేరకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ అడ్వైజరీ జారీ చేసింది. ఢిల్లీలో ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా విమాన కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడిందని వెల్లడించింది. విమానాలు ఆలస్యంగా నడిచే అవకాశం ఉందని ప్రయాణికులను అప్రమత్తం చేసింది. అప్‌డేట్ల కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని సూచించింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని తన ప్రకటనలో పేర్కొంది. ఆటోమేటిక్ మెసేజ్ స్విచింగ్ సిస్టమ్ లో సాంకేతిక సమస్య వల్లే అంతరాయం ఏర్పడిందని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఇప్పటికే వెల్లడించింది. దీన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందాలు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తూ సామాజిక మాధ్యమంలో పోస్టు చేసింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్టు టెర్మినల్ల లోపల, బోర్డింగ్ గేట్ల వద్ద భారీ సంఖ్యలో ప్రయాణికులు క్యూలో వేచిచూడాల్సి వస్తోంది. ఈ సమస్యకు సైబర్ దాడి ఏమైనా కారణమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాంకేతిక సమస్య కారణంగా ముంబైతో పాటు జైపుర్, లఖ్‌నవూ, వారణాసి, ఇతర అంతర్జాతీయ విమానాశ్రయాల్లో కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతోంది.

# వందేమాతరంతో ఆత్మవిశ్వాసం



**అది భవిష్యత్‌కు సరికొత్త భరోసా**

**150వ స్మారకోత్సవంలో ప్రధాని మోదీ**

**హైదరాబాద్, నవంబరు 7:** వందేమాతరం శబ్దం విన్నంతనే మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుందని ప్రధాని మోడీ అన్నారు. భవిష్యత్తుకు సరికొత్త భరోసా ఇస్తుందన్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో వందేమాతరం 150వ స్మారకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయానికి శుక్రవారంతో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ గేయాన్ని నవంబరు 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఈ గేయం.. తొలిసారి ఛటర్జీ రాసిన 'ఆనంద్ మఠ్' నవలలో ప్రచురితమైంది. వందేమాతరం గేయం ఒక స్వప్నం, ఒక సంకల్పం, ఒక మంత్రం అని ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. అది దేశమాత ఆరాధన, సాధన అని పేర్కొన్నారు. ఈ గేయం మనందరినీ పురాణ ఇతిహాసాల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. ఈ సామూహిక గేయాలాపన అద్భుత అనుభవం. ఒకే లయ, స్వరం, భావంతో గేయాలాపన హృదయాన్ని స్పందింపజేస్తుందని ప్రధాని అన్నారు. వందేమాతరం 150 ఏళ్ల స్మారకోత్సవాలు నిర్వహించుకుంటున్నామని, ఇవి దేశ ప్రజలకు ప్రేరణనిస్తాయని మోదీ అన్నారు. వందేమాతరం స్మారక స్టాంపు, నాణెం విడుదల చేశాం. ప్రతి గీతానికి ఒక మూలభావం, సందేశం ఉంటుంది. మన వందేమాతరం మూలభావం భారత్, మా భారతి అని పేర్కొన్నారు. ఇది దేశానికి ఒక ప్రార్థన లాంటిదన్నారు.. ఇది మనల్ని చరిత్రలోకి తీసుకెళుతుంది. ఇది మన భవిష్యత్తుకు ధైర్యాన్ని ఇస్తుంది. భారతీయులు సాధించలేని సంకల్పం లేదు. సాధించలేని లక్ష్యం లేదని మోడీ పేర్కొన్నారు. నవంబర్ 7 అనేది ఒక చారిత్రాత్మక రోజు అని.. వందేమాతరం ఆవిర్భవించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఘనంగా వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం కోట్లాది మంది భారతీయుల్లో కొత్త శక్తిని ఉత్పత్తి చేస్తుందని చెప్పారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి పౌరుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఇక 1950లో భారతదేశం గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన సందర్భంగా ఈ వందేమాతరం గేయాన్ని జాతీయ గేయంగా గుర్తించారు. ఇదిలా ఉంటే కేంద్ర ప్రభుత్వం ఈ 2025 సంవత్సరాన్ని 150 ఏళ్ల 'వందే మాతరం'గా పరిగణించింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది 2026, నవంబర్ 7 వరకు దేశవ్యాప్తంగా వందేమాతరం జాతీయ గేయం సంస్మరణోత్సవాలను జరపాలని నిర్ణయించింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తేసే కుట్ర



- రేవంత్ వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం
- బకాయిలు చెల్లించకుంటే చదువెలా సాగిస్తారు
- ప్రైవేట్ కాలేజీలకు మా మద్దతు కొనసాగిస్తాం
- కేంద్రమంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, నవంబరు 7:** ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసే కుట్రలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారని, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అడిగితే.. ప్రైవేట్ కాలేజీ యజమాన్యాలని సీఎం రేవంత్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ చేస్తారా? అని ఫైర్ అయ్యారంటే అరథం చేసుకోవచ్చున్నారు. అసెంబ్లీ సాక్షిగా ప్రతినెలా బకాయిలు చెల్లిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. బకాయిలు చెల్లిస్తామని టోకెన్లు ఇచ్చి మోసం చేసింది నిజం కాదా? అని నిలదీశారు. బకాయిలు చెల్లించకుండా కాలేజీలను మోసం చేస్తోంది నిజం కాదా? అని అన్నారు. శుక్రవారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతే.. మరి టోకెన్లు ఎందుకు ఇచ్చినట్లు? అని ప్రశ్నించారు. రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా ఎందుకు హామీ ఇచ్చారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన హామీకే విలువ లేకుంటే ఇక అసెంబ్లీకి విలువ ఏముందని అడిగారు. సార్వత్రిక ఎన్నికలకు ముందే తెలంగాణ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని రేవంత్‌రెడ్డే చెప్పారు కదా? అని గుర్తుచేశారు. ఇప్పుడు అందుకు భిన్నంగా మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోతే కాలేజీలు ఎలా నడవాలని నిలదీశారు. అధ్యాపకులకు జీతాలివ్వకపోతే విద్యార్థులకు చదవు చెప్పేదెవరు? అని అడిగారు. కాలేజీ యాజమాన్యాలపై సీఎంకు ఉన్న కోపంతో.. విద్యార్థుల జీవితాలను బలి చేయాలనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని ఆరోపించారు. చట్టం పేరుతో బెదిరింపులకు పాల్పడితే పాలన నడవదనే విషయాన్ని సీఎం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించి చట్టం గురించి మాట్లాడితే మంచిదని సూచించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కొనసాగిస్తారా? ఎత్తి వేస్తారా? ప్రజలకు స్పష్టం చేయాలని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేదాకా.. విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ యాజమాన్యాల ఆందోళనకు బీజేపీ మద్దతు కొనసాగుతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.

# నేటి నుంచి తెరుచుకోనున్న కాలేజీలు

- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కుదరిరన సయోధ్య
- భట్టితో సమాఖ్య ప్రతినిధుల చర్చలు
- వెంటనే బంద్ విరమిస్తున్నట్లు ప్రకటన



**హైదరాబాద్, నవంబర్ 7:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై నెలకొన్న సంక్షోభానికి తెరపడింది. ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కతో ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలు శుక్రవారం జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన యాజమాన్యాలు తమ సమ్మెను విరమించుకునేందుకు అంగీకరించాయి. దీంతో వేలాది మంది విద్యార్థులకు ఊరట లభించింది. అంగీకారం కుదరడంతో రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు శనివారం తిరిగి తెరుచుకోనున్నాయి. శుక్రవారం సాయంత్రం కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమై, తమకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో సుమారు 1500 కోట్ల బకాయిలు రావాల్సి ఉందని ప్రస్తావించారు. వారి విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న భట్టి విక్రమార్క, ప్రభుత్వం తరఫున కీలక హామీలతో సమస్యను సత్వరం పరిష్కరించారు. తమ ప్రభుత్వం ఇప్పటికే రూ. 600 కోట్లు విడుదల చేసిందని తెలియజేశారు. అంతేకాకుండా, తక్షణమే మరో 600కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. మిగిలిన 300కోట్లను త్వరలోనే విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ విధంగా, యాజమాన్యాలు కోరిన పూర్తి బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఈ క÷-రమంలో ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో చర్చల అనంతరం బంద్ విరమిస్తున్నట్టు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కళాశాలలతో పాటు డిగ్రీ, పీజీ కళాశాలలను ఈనెల 3వ తేదీ నుంచి బంద్ కారణంగా మూతబడ్డాయి. ప్రభుత్వంతో కాలేజీల యాజమాన్యాలు జరిపిన చర్చలు సఫలం కావడంతో కళాశాలలు యథావిధిగా తెరుచుకోనున్నాయి. ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు, పలువురు ఉన్నతాధికారులు చర్చల్లో పాల్గొన్నారు. బకాయిల చెల్లింపుతో ప్రస్తుత సమస్య పరిష్కారమైనప్పటికీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో భవిష్యత్తులో ఇలాంటి ఆటంకాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీనిలో భాగంగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి, సకాలంలో పారదర్శకంగా చెల్లింపులు జరిగేలా కొత్త మార్గదర్శకాలను సూచించడానికి త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం శాశ్వత పరిష్కారాన్ని అమలు చేయనుంది.

# సీఎం రేవంత్‌వి బ్లాక్ మెయిల్ రాజకీయాలు



- ఓటర్లను బెదిరించే ధోరణిలో ప్రసంగాలు
- ఓట్లు వేయకుంటే రేషన్ కార్డులు ఇవ్వమనడం దారుణం
- మండిపడ్డ మాజీమంత్రి హరీష్ రావు

**హైదరాబాద్, నవంబరు 7:** బ్లాక్ మెయిల్ చేసి జూబ్లీహిల్స్‌లో ఓట్లు వేయించుకోవాలని సీఎం రేవంత్ చూస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకుంటే.. రేషన్ కార్డులు ఆగిపోతాయం టున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి అయ్య జాగీరా? రేవంత్ ఇంట్లో నుంచి ఇస్తున్నారా అంటూ ఫైర్ అయ్యారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీష్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్ అంటూ కామెంట్స్ చేశారు. చెప్పుకోవడానికి ఏమీ లేకనే.. జూబ్లీహిల్స్‌లో రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ఓటమి భయంతో రేవంత్ రెడ్డి వ్యక్తిగత కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్లాక్ మెయిలర్‌కు జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. కంటోన్మెంట్‌లో ఆరు వేల డబుల్ బెడ్రూం ఇళ్ళు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి కంటోన్మెంట్‌లో గెలిచారన్నారు. రెండేళ్ళుగా అజహారుద్దీన్‌కు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. బీఆర్ఎస్ ఒత్తిడితోనే ముస్లింలకు మంత్రి పదవి.. ఎన్టీఆర్, పీజేఆర్ విగ్రహాల హామీలు అంటూ వ్యాఖ్యలు చేశారు. సినీ యాక్టర్స్‌ను జైల్లో పెట్టిన రేవంత్.. సినీ కార్మికులకు ఒంగి ఒంగి దండాలు పెడుతున్నారంటూ ఎద్దేవా చేశారు. 2023లో పీజేఆర్ కొడుకుకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని అడిగారు. కాంగ్రెస్ అరాచకం, మంత్రి పదవి ఇవ్వకపోవటంతోనే పీజేఆర్ చనిపోయారంటూ సంచలన కామెంట్స్ చేశారు. జూబ్లీహిల్స్ ప్రజల తీర్పుతో రాష్ట్ర భవిష్యత్‌కు దశ దిశ ఏర్పడుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గం కూడా సంతృప్తిగా లేదని అన్నారు. నాలుగు కోట్ల ప్రజలు కాదు.. నలుగురు బ్రదర్స్ మాత్రమే హ్యాపీగా ఉన్నారంటూ కామెంట్స్ చేశారు. గ్యారంటీలు ఎగ్గొట్టిన అరాచక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంటూ విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. మూడేళ్ళ పాటు నరకయాతన అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. వికాసానికి.. విధ్వంసానికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ఏది కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రేవంత్ అంటేనే బ్లాక్ మెయిలర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి పారిశ్రామికవేత్తలను బెదిరించిన చరిత్ర రేవంత్ ది అని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడుగుతోన్న కళాశాలను రేవంత్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను కేసీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. హైడ్రా విషయంలో డిప్యూటీ సీఎం భట్టి, సీఎం బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ హరీష్ రావు మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు మర్రి జనార్ధన్ రెడ్డి, రవీందర్ రావు ఇంటిపై దాడులను మాజీ మంత్రి ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులను బెదిరిస్తోందన్నారు. కాంగ్రెస్ అరాచకాలపై 20 ఫిర్యాదులు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. హోంమంత్రిగా, విద్యామంత్రిగా, మున్సిపల్ మంత్రిగా.. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఎ÷-లాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రిపై రోజుకో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉత్తరాలు రాస్తున్నారని.. సొంత ప్రభుత్వంపై ముఖ్యమంత్రికి పట్టు లేదంటూ విమర్శలు గుప్పించారు. రేవంత్ హయాంలో క్రైం రేటు పెరిగిందన్నారు. కమిషన్ల కోసం కమాండ్ కంట్రోలు సెంటర్‌లో సీఎం సమీక్షలు చేస్తున్నారని మాజీమంత్రి ఆరోపించారు. బీజేపీ నుంచి 8 మంది ఎంపీలు గెలిచినా తెలంగాణకు తెచ్చింది గుండు సున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. నవీన్ యాదవ్ తమ్ముడు వెంకట్ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటే అని ఆరోపించారు. ప్రధాని చెప్పిన ఆర్ఆర్ టాక్స్‌పై ఎందుకు చర్యలు లేవని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలు కలిసి బీసీలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఎప్పుడు వచ్చింది? ముస్లింలు ఎప్పుడు నుంచి ఉన్నారు అని నిలదీశారు. కాంగ్రెస్ లేకుంటే.. ముస్లింలు లేరన్న రేవంత్ రెడ్డి కామెంట్స్ అన్యాయమన్నారు. ముస్లింలను రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. ముస్లింలకు రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు.



# శబరిమలకు ప్రత్యేక రైళ్లు..

**హైదరాబాద్, నవంబర్ 7:** అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది. శుక్రవారం నుంచి (నవంబర్ 7) జనవరి వరకు 60 ప్రత్యేక రైళ్లను తిప్పనుంది. చర్లపల్లి, మచిలీపట్నం, నర్సాపూర్ నుంచి శబరిమల సమీప స్టేషన్ల వరకు నడుపుతుంది. శుక్రవారం నుంచి ఈ రైళ్లకు సంబంధించిన టికెట్లు రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది. చర్లపల్లి నుంచి కొల్లాం (రైలు నంబర్ 07107)- నవంబర్ 17, 24 తేదీల్లో, డిసెంబర్ 1, 8, 15, 22, 29 తేదీల్లో, జనవరి 5, 12, 19 తేదీల్లో చర్లపల్లి నుంచి బయల్దేరుతాయి. ఇవి మరుసటి రోజు కొల్లాం చేరుకుంటాయి. మొత్తం 10 రైళ్లను అందుబాటులో ఉంచారు. ఇవి పగిడిపల్లి, గుంటూరు, గూడూరు, రేణిగుంటలో ఆగుతాయి. కొల్లాం నుంచి చర్లపల్లి (రైలు నంబర్ 07108)- నవంబర్ 19, 26 తేదీల్లో, డిసెంబర్ 3, 10, 17, 24, 31 తేదీల్లో, జనవరి 7, 14, 21 తేదీల్లో కొల్లా నుంచి బయల్దేరుతాయి. మరుసటి రోజు చర్లపల్లి చేరుకుంటాయి. ఈ రైళ్లు రేణిగుంట, గూడూరు, గుంటూరు, పగిడిపల్లి మీదుగా వస్తాయి.

# పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

**మేడ్చెల్,నవంబర్ 7 :** కబ్జారాయుళ్ల నుంచి పార్క్ స్థలాన్ని హైడ్రా స్వాధీనం చేసుకుంది. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధి చౌదరిగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక శ్రీనివాస కాలనీలో 400 గజాల పార్కు స్థలాన్ని కబ్జాదారుల నుంచి హైడ్రా అధికారులు రక్షించారు. లే అవుట్ చేసిన సమయంలో ఈ స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. దాన్ని అభివృద్ధి చేయకపోవడంతో కొందరు తప్పుడు పత్రాలతో కబ్జా చేశారు. కాలనీవాసులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి స్పందన రాలేదు. దీంతో హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. కబ్జాకు గురయినట్లు తేలడంతో శుక్రవారం అధికారులు పార్కులో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి, చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యల పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఉద్యోగాల కోసం సైబర్ ఉచ్చులో పడ్డ నిరుద్యోగులు

## వారిని కాపాడి స్వదేశీనికి రప్పించిన కేంద్రం

**న్యూఢిల్లీ, నవంబర్ 7:** ఉద్యోగాల పేరిట మోసపోయి, మయన్మార్, థాయ్‌లాండ్ సరిహద్దులో సైబర్ నేర కేంద్రంలో చిక్కుకున్న పలువురు బాధితులు దిల్లీ చేరుకున్నారు. కేంద్రప్రభుత్వం తీసుకున్న చొరవతో వీరు బంధవిముక్తులు అయ్యారు. ఉద్యోగాల పేరుతో మోసపోయి వీరు సైబర్ నేరగాళ్ల వలలో చిక్కున్నారు. ఇందులో ఏపీకి చెందిన 11 మంది, తెలంగాణకు చెందిన మరో 11 మంది ఏపీ, తెలంగాణ భవన్‌లకు చేరుకున్నారు. అక్కడి అధికారులు నేటి మధ్యాహ్నం లోగా బాధితులను స్వస్థలాలకు చేర్చనున్నారు. సైబర్ నేరాల్లో చిక్కుకున్న పలువురు భారతీయులను ప్రత్యేక వైమానిక దళ విమానంలో విదేశాంగశాఖ అధికారులు దిల్లీకి తీసుకొచ్చారు. ఐటీబీపీ కేంద్రంలో అన్ని రకాల పత్రాలను పరిశీలించి, సంబంధిత రాష్ట్రాల యంత్రాంగంతో సంప్రదించిన తర్వాత తెలుగు రాష్ట్రాల అధికారులకు అప్పగించారు. సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోయి, నకిలీ ఉద్యోగాల మోజులో పడకుండా జాగ్రత్తపడాలని సూచించారు. స్వదేశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# ఇక్కడ పెట్టుబడులు పెట్టండి

## ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో 'తెలంగాణ' రోల్ మోడల్

## 'అమెరికా - యూటా' రాష్ట్ర పారిశ్రామికవేత్తలకు శ్రీధర్‌బాబు పిలుపు



**హైదరాబాద్, నవంబర్ 7:** ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలిచిన 'తెలంగాణ'లో అవకాశాలు పుష్కలమని, ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా - యూటా పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా ఎండీ, సీవోవో డేవిడ్ కార్లెబాగ్ నేతృత్వంలోని 'యూటా పారిశ్రామికవేత్తల బృందం' శుక్రవారం సచివాలయంలో ఆయనను ప్రత్యేకంగా కలిసింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్, ఏరోస్పేస్, డిఫెన్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, లైఫ్ సైన్సెస్, ఏఐ ఆధారిత హెల్త్ కేర్, క్లీన్ ఎనర్జీ, ఎడ్యుకేషన్, స్కిల్స్ తదితర రంగాల్లో 'యూటా-తెలంగాణ' మధ్య ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడికి గల అవకాశాలపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... కేవలం పెట్టుబడులను ఆకర్షించడమే కాక, గ్లోబల్ ఎకానమీకి సపోర్ట్ ఇచ్చేలా, లాంగ్-టర్మ్ వాల్యూ క్రియేషన్ కు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తీసుకొచ్చిన సంస్కరణలు, పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఏయే రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ అనుకూలం, పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలు, పారిశ్రామికవేత్తలకిచ్చే ప్రోత్సాహకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం టీ-హబ్, టీ- వర్క్స్, వీ హబ్ లను వరల్డ్ ట్రేడ్ సెంటర్ - యూటా, సిలికాన్ స్లోప్స్, యూటా టెక్ స్టార్టప్‌లతో అనుసంధానించేలా చొరవ చూపాలని ప్రతినిధి బృందాన్ని ఆయన కోరారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో యూనివర్సిటీ ఆఫ్ యూటా, బీవైయూ, న్యూమాంట్ యూనివర్సిటీలతో కలిసి రాష్ట్రంలోని ప్రముఖ విద్యా సంస్థలు ఉమ్మడి అకడమిక్, రీసెర్చ్ ప్రోగ్రామ్ లను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'యూటా' రాష్ట్రంతో పటిష్ఠమైన, దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ద్వైపాక్షిక సహకారం పెట్టుబడులకే పరిమితం కాకుండా ఇన్నోవేషన్, స్కిల్స్, టెక్నాలజీ రంగాల్లోఉమ్మడి ఆవిష్కరణలకు దిక్సూచీగా మారాలని మంత్రి శ్రీధర్ బాబు ఆకాంక్షించారు. తెలంగాణ లాంటి ఫాస్ట్-గ్రోయింగ్, డైనమిక్, ప్రో-యాక్టివ్ రాష్ట్రంతో కలిసి పని చేసేందుకు 'యూటా' సిద్ధంగా ఉందని డేవిడ్ కార్లెబాగ్ అన్నారు. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సహకారం, నైపుణ్య మార్పిడి విషయంలో తెలంగాణతో కలిసి చురుగ్గా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటా హౌజ్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ జేసన్ థాంప్సన్, మాట్ మాక్‌ఫెర్సన్, నికోల్ మాక్‌ఫెర్సన్, లైఫ్ టైం ప్రెసిడెంట్ బీజే హాకే, జేకేడీ ప్రెసిడెంట్ మైక్ నెల్సన్, మోనెరె ఏఐ సీఈవో, కో-ఫౌండర్ మౌ నంది, భారత్ వ్యాలీ అడ్వైజర్లు స్టీవ్ వుడ్, సున్‌హాష్ లోడే, ఎక్విప్ సోషల్ ఇంపాక్ట్ టెక్నాలజీస్ ఫౌండర్ లక్ష్మినారాయణ, ఐఐఆర్ఎఫ్ గురు సౌలే తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

## స్వాతంత్ర్యోద్యమంలో ప్రేరణ మంత్రం

# వందేమాతరం!

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల్లో వందేమాతరం తరవాత భారతదేశం నా మాతృభూమి..అంటూ ప్రతిజ్ఞ చేయించేవారు. వందేమాతరం చదివిన తరవాతనే పాఠశాల తరగతి గదులు ప్రారంభం అయ్యేవి. ఆనాటి నిబద్దత ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లు వచ్చాక కనుమరుగయ్యింది. జగనణమన కూడా మనదేశ ఆత్మగా నిలిచింది. ఈ రెండు గీతాలకు భారతదేశంలో విడదీయరాని సంబంధం ఏర్పడింది. దేశాన్ని ఏకతాటిపై నడిపించిన వందేమాతరం గీతానికి 150 వత్సరాలు. నిత్యనూతనంగా ఇప్పటికీ వందేమాతరం మార్మోగు తోంది. దేశాన్ని కట్టిపడేసే ప్రార్థనాగీతంగా ఇది ఎంతో ప్రాచుర్యం కలిగించింది. స్వాతంత్ర్య ఉద్యమ శ్లోకంగా నిలిచి నేటికీ జాతీయ గీతంగా భాసిల్లుతోంది. వందేమాతర గీతం తరవాతనే దేశవ్యాప్తంగా ఉత్తేజితం మొదలయ్యింది. బ్రిటిష్ వారిని పారదోలేందుకు ఇది ఎంతగానో తోడ్పడింది. ప్రజలను ఏకం చేయడంలో వందేమాతర గీతం నిప్పుకణికలా మండింది. ఎక్కడిక్కడ వందేమాతరం గీతాలాపనతో ప్రజలు ఉద్యమంలో దుమికారు. అందుకే ఆనాటి బ్రిటిష్ పాలకులు వందేమాతర గీతం పాడిన వారిపై దమనకాండకు తెగించారు. 1875లో కార్తిక శుక్ల నవమి, జగద్దాత్రి పూజనాడు బంకించంద్ర ఛటర్జీ కలం నుంచి జాలువారిన వందేమాతర గీతం...స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. భారతదేశ పురాతన సాంస్కృతిక మూలాలు ఈ గీతరచనకు ప్రేరణనిచ్చాయి. సర్వ మంగళ మాంగళ్యే శివే... అంటూ సాగే దేవీమాత స్తోత్రం వందేమాతరం గీతానికి ప్రేరణగా భావిస్తారు. అందుకే కొందరు దీనిని పాడడానికి ఇప్పటికీ ఇష్టపడరు. ఇది మనదేశ దౌరభాగ్యంగా చూడాలి. మతం ముసుగులో కొందరు దీనిని తృణీకరించినా అది ప్రజల నరనరాల్లో జీర్ణించుకుపోయిన ఉత్తేజిత గీతంగా నిలిచింది. భారతదేశ చరిత్రలో మహోద్యమాలకు కళలూ పాటలూ అంతరాత్మగా నిలిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అంతెందుకు తెలంగాణ ఉద్యమంలో పాటే పరవళ్లు తొక్కపోతే ఉద్యమమే లేదు. జాతి భావోద్వేగాలను వెన్నుతట్టి స్వాతంత్ర్య కాంక్ష అనే సమష్టి కార్యాచరణ కు పురిగొల్పడంలో వందేమాతరం గీతం కీలకభూమిక పోసించింది. అందుకే భారత స్వాతంత్ర్య పోరాటంలో అత్యంత ప్రత్యేకమైనదిగా వందేమాతరం గీతం నిలిచింది. ఈ అమర గీతం వెలువడి 150 సంవత్సరాలైనందున ఏడాదిపాటు దేశమంతటా ఉత్సవాలు నిర్వహించాలని కేంద్రం నిశ్చయించింది. స్వాతంత్ర్య ఉద్యమానికి జవజీవాలు అందించడమే కాదు, సాంస్కృతిక జాతీయవాదానికి బీజం వేసింది. భారతదేశమంటే మట్టి కాదనీ... కర్తవ్యం, అంకితభావాలతో పునీతమైన పుణ్యతీర్థమనీ ప్రబోధించింది. మహర్షి అరవిందుడు వర్ణించినట్లు- బంకించంద్రుడు ఆధునిక భారత రుషి. ఆయన పదాలు జాతి ఆత్మను మళ్లీ మేల్కొలిపాయి. నిదురిస్తున్న జాతి తన ఆత్మబలాన్ని కనుగొనేలా జాగృతం చేయడంలో వందేమాతరం గీతం ప్రముఖ భూమిక పోషించదనడంలో సందేహం లేదు. బ్రిటిష్ పాలకుల ఇనుప ఉక్కు సంకెళ్ల కింద నలిగిపోతున్న తరుణంలో బంకించంద్ర ఛటర్జీ రచించిన వందేమాతరం జాతికి ప్రభాత గీతమైంది. మన సంస్కృతి, నాగరికతల పట్ల గర్వాభిమానాలను రేకెత్తించే గానమైంది. అణు-వణువునా మాతృభూమిపై భక్తి, అనురక్తి ఉట్టిపడేలా మేల్కొలిపే రణనినాద గీతమైంది. వందేమాతరం భాషా ప్రాంతీయ భేదాలకు అతీతంగా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు జాతిని జాగృతం చేసింది. బ్రిటిష్ వలస పాలకులపై ధిక్కార ప్రకటనగా ప్రజలు యావద్దేశంలో వందేమాతరం అంటూ నినదించారు. 1905లో బెంగాల్ విభజనపై నిరసన వెల్లువెత్తినప్పుడు వందేమాతరం అంతటా మార్మోగింది. దాంతో బ్రిటిష్ పాలకులు ఆ పాటను నిషేధించారు. కానీ, 1906 ఏప్రిల్ 14న బారిసాల్‌లో వేలమంది ఉద్యమకారులు ఆ నిషేధాన్ని ధిక్కరించి వందేమాతరం అంటూ ఘోషించారు. లాఠీ దెబ్బలకు రక్తమోడుతున్నా లెక్కచేయకుండా స్త్రీపురుషులు అలా ఘోషిస్తూనే ఉన్నారు. 1946లో తిరుగుబాటు చేసిన రాయల్ ఇండియన్ నేవీలోని భారతీయ నావికులు వందేమాతరం అంటూ నినదిస్తూ బ్రిటిష్ యుద్ధనౌకలపై జాతీయ పతాకను ఆవిష్కరించారు. మొద్దునిద్రలో ఉన్నవారినైనా మేల్కొలిపే మంత్రశక్తి వందేమాతరానికి ఉందని మహాత్మాగాంధీ పేర్కొన్నారు. ఇన్నేళ్లయినా వన్నె తగ్గకుండా మనజీవితాల్లో అది పెనవేసుకుపోయింది. భారతజాతిని కలసి ఉంచే గీతంగా నిలిచింది. స్వాతంత్ర్య ఉద్యమంలో వెలిగిన ఈగీతాజ్యోతి ఇంకా జ్వాజ్వల్యమానంగా వెలుగుతోంది. ఇప్పుడు ఏడాది ఉత్సవాల్లో భాగంగా వందేమాతరం పూర్తిరూపంలో ప్రతిధ్వనిస్తూ యువత మనసుల్లో సాంస్కృతిక జాతీయవాదాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. వందేమాతరం కేవలం గత వైభవ స్మరణం కారాదు. మనజాతిని మేల్కొలిపే ఉజ్జ్వల భవిష్యత్తుకు ప్రేరణగానూ తీసుకోవాలి. భారత ఆత్మను ఆవహించుకునే గీతంగా చూడాలి. ఘనమైన భారతదేశ సంస్కృతీ నాగరికతలపై మనకున్న అభిమానాలకు నిదర్శనమైన ఆ గీతస్ఫూర్తిని ఆచరణలోకి తీసుకురావడం మనందరి బాధ్యత. వందేమాతరం పారతంత్ర భారతదేశానికి తొలి మేల్కొలుపు. మొక్కవోని దీక్షను చాటిన స్వేచ్ఛా గీతమది. భారతదేశపు ఆత్మ నుంచి జనించిన ఈ గీతం అజరామజరంగా నిలుస్తుంది. తరతరాలకు ఉత్తేజమిస్తుంది. భారతీయత అనే కోణం నుంచి మన చరిత్ర, సంస్కృతి, విలువలు, సంప్రదాయాలను వీక్షించి... నిరంతరం స్ఫూర్తి పొంది... సదా కార్యాచరణలో నిమగ్నం కావాలని ప్రబోధించే దివ్య గానంగా వందేమాతరం నిరంతర స్మరణ కావాలి. పాలకులు దీన్ని ప్రేరణగా తీసుకుని భారత పునరుజ్జీవానికి అంకితం కావాలి. కేవలం గీతాలాపనతో సరిపుచ్చక భారత ఉజ్వల భవిష్యత్‌కు ప్రేరణగా తీసుకోవాలి. దేశంముందు వందనం చేయడంతో పాటు, సంకల్ప సిద్ది కోసం వందేమాతరం గీతాన్ని ఆలపించాలి. దేశీయంగా స్వయం సమృద్ది సాంధించేందుకు నేటికీ ఇది ప్రేరణ మంత్రంగా నిలవాలని ఆశిద్దాం.

# ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, నా మిత్రుడు

- 2026లో భారత్ లో పర్యటిస్తా
- వాణిజ్య సంబంధాలను పటిష్టం చేస్తా
- డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, నవంబర్ 7:** అమెరికా- భారత్ మధ్య టారిఫ్ ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీని ఉద్దేశించి అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి, తన మిత్రుడు అంటూ కొనియాడారు. అలాగే, ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను పటిష్టం చేసే ప్రయత్నాల్లో భాగంగా, వచ్చే ఏడాది తాను భారత్‌ను సందర్శించే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత్‌తో వాణిజ్య చర్చలపై విలేకరులు ప్రశ్నలు అడిగారు. ఈ క్రమంలో మోదీతో తన చర్చలు అద్భుతంగా సాగుతున్నాయని ట్రంప్ సమాధానం చెప్పారు. ప్రధాని మోదీ రష్యా నుంచి ఇంధన కొనుగోలును చాలా వరకు ఆపేశారు. ఆయన నాకు మిత్రుడు, మేము మాట్లాడుతుంటాం. మోదీ గొప్ప వ్యక్తి. ఆయన నాకు మిత్రుడు, ఆయన నన్ను అక్కడికి రావాలని ఆహ్వానించారు. నేను తప్పకుండా వెళతాను. పర్యటనను ఖరారు చేస్తామని అన్నారు. తాను భారత్‌కు వెళతానని ట్రంప్ చెప్పిన నేపథ్యంలో వచ్చే ఏడాది వెళ్లే అవకాశం ఉందా? అని విలేకరులు అడిగారు. దీనికి ట్రంప్ బదిలిస్తూ ' అవును, వచ్చే ఏడాది ఉండొచ్చు' అని సమాధానం చెప్పారు. వాస్తవానికి భారత్?లో జరగాల్సిన క్వాడ్ మీటింగ్‌కు ట్రంప్ రావాల్సి ఉంది. అయితే ట్రంప్ ఇకపై క్వాడ్ సమ్మిట్ కోసం భారత్‌కి రాకపోవచ్చని అన్నారు. ఈ ఏడాది ఆగస్టులో ఒక వ్యాసంలో పేర్కొంది. భారత్‌తో వాణిజ్య సుంకాల (టారిఫ్) వివాదాల నేపథ్యంలో ఆ ప్రయాణాన్ని వాయిదా వేసినట్లు ఆ రిపోర్ట్ తెలియజేసింది. అయితే ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ సానుకూల దిశలో సాగుతున్నాయనే సంకేతంగా భావించవచ్చు. ప్రస్తుతం భారత్ - అమెరికా మధ్య వాణిజ్య చర్చలు కీలక దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ట్రంప్ నుంచి ఇలాంటి కామెంట్స్ రావడం ప్రాధాన్యత సంతరించుకొన్నది. రష్యా చమురును భారత్ కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో అమెరికా అదనంగా 25 శాతం సుంకాలని విధించిన విషయం తెలిసిందే. ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యాను ఆర్థికంగా ఒంటరి చేయాలని భారత్‌పై ట్రంప్ అదనపు సుంకాలను విధించారు. అయితే, తాజాగా భారత్ రష్యా నుంచి ఇంధన కొనుగోళ్లను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఇటీవల ట్రంప్ స్వయంగా ప్రకటించారు. అంతేకాకుండా, ఆగిపోయిన వాణిజ్య చర్చలు కూడా ఫలప్రదంగా సాగుతున్నట్లు వెల్లడించారు. దీపావళి రోజు కూడా మోదీకి కాల్ చేసి ట్రంప్ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు రష్యా చమురు కొనుగోలు, వాణిజ్యంపై చర్చించినట్లు ట్రంప్ మరోసారి పునరుద్ఘాటించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కూడా దీనిపై క్లారిటీ ఇచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ భారత్-అమెరికా సంబంధాలపై సానుకూలంగా ఉన్నారని, వైట్‌హౌస్‌లో జరిగిన దీపావళి వేడుకల సందర్భంగా ప్రధాని మోదీతో నేరుగా మాట్లాడారని ధృవీకరించారు. అయితే రష్యా నుంచి భారత్ ఇంధన కొనుగోళ్లను తగ్గించుకుంటుందన్న ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ నెల ప్రారంభంలో స్పందించింది. తమ దేశం ఇంధన విధాన నిర్ణయాలు జాతీయ ప్రయోజనాలు, వినియోగదారుల సంక్షేమం ఆధారంగా మాత్రమే ఉంటాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

# వందేమాతరం జాతీయవాద జ్వాలను రగిలిస్తోంది

## అమిత్ షా కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, నవంబర్ 7:** వందేమాతరం గేయానికి 150 ఏళ్లు నిండాయి. స్వాతంత్ర్యోద్యమంలో ఆ గేయం ప్రజల్లో ఎంతో స్ఫూర్తి నింపింది. అయితే ఆ గేయం దేశ ప్రజల్లో ఇప్పటికీ నిరంతరం జాతీయవాద జ్వాలను రగిలిస్తోందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. దేశ ఐక్యత, దేశభక్తి, యువతలో ఉత్తేజానికి ఆ గేయం ఇంకా మూలంగానే ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ఓ పోస్టు చేశారు. నవంబర్ 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది నవంబర్ 7వ తేదీ వరకు వందే మాతరం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. వందేమాతర గేయం కేవలం పదాల అల్లిక కాదు అని, అది భారత దేశ అంతరాత్మను అందించిన స్వరమన్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వందేమాతర గీతం దేశాన్ని ఐక్యంగా నిలిపిందన్నారు. స్వాతంత్ర్యోత్సవ జాగరణను బలోపేతం చేసిందన్నారు. మాతృదేశం కోసం అంకితమయ్యేలా, గర్వపడేలా, స్ఫూర్తి పొందేలా ఆ గేయం విప్లవకారుల్ని ఆకట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాదితో మన జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండుతున్నట్లు ఆయన చెప్పారు. ఈ గేయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి బలమైన స్వరంలో పూర్తి పాటను పాడాలని, భవిష్యత్తు తరాలకు వందేమాతర గేయం ప్రేరణగా నిలుస్తుందని అమిత్ షా తెలిపారు. వందేమాతర గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ కంపోజ్ చేశారు. సాహిత్య జర్నల్ బంగదర్శన్‌లో నవంబర్ 7, 1875లో ఈ గేయం పబ్లిష్ అయ్యింది. ఆ తర్వాత 1882లో ప్రచురించిన ఆనందమట్ నవలలోనూ ఈ గేయాన్ని ఆయన పొందుపరిచారు. రబీంద్రనాథ్ ఠాకూర్ ఈ గేయానికి మ్యూజిక్ అందించారు.

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో

# సాంకేతిక సమస్య

విమానాల రాకపోకలకు అంతరాయం



**న్యూఢిల్లీ, నవంబర్ 7:** దేశ రాజధాని దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తింది. ఎయిర్‌పోర్టులోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతికలోపం తలెత్తడంతో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీని కారణంగా దాదాపు 100కు పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయాల్లో ఒకటైన దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రోజుకు 1500లకు పైగా విమానాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తున్న ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. తాము ప్రయాణిస్తున్న విమానం రన్‌వేపై అరగంటకు పైగా నిలిచిపోయిందని, ఏటీసీ సిస్టమ్‌లో సమస్య వల్లే ఈ జాప్యం జరిగిందని సిబ్బంది తెలియజేశారని ఆయన పేర్కొన్నారు. ఈ గ్లిచ్ కారణంగా విమానాల రాకపోకలు రెండింటికీ కొంతసేపు అంతరాయం ఏర్పడింది. దీంతో బోర్డింగ్ గేట్ల వద్ద ప్రయాణికుల రద్దీ పెరిగిపోయింది. సాంకేతిక బృందాలు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నాయని, త్వరలోనే కార్యకలాపాలు సాధారణ స్థితికి వస్తాయని ఎయిర్ ఇండియా సిబ్బంది ప్రయాణికులకు సర్దిచెప్పారు. ఆశ్చర్యకరంగా ఇదే విమానాశ్రయంలో ఇలాంటి సాంకేతిక సమస్య తలెత్తడం ఈ వారంలో ఇది రెండోసారి. కేవలం రెండు రోజుల క్రితం, బుధవారం కూడా ఇదే తరహాలో సమస్య తలెత్తగా, దాన్ని పరిష్కరించినట్లు, కార్యకలాపాలు సాధారణ స్థితికి వచ్చాయని విమానాశ్రయ అధికారులు ప్రకటించారు. ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలతో ముందుకు సాగవచ్చని కూడా సూచించారు. బుధవారం నాటి సమస్యపై ఎయిర్ ఇండియా స్పందిస్తూ.. థర్డ్-పార్టీ కనెక్టివిటీ నెట్‌వర్క్‌లో సమస్య కారణంగా కొన్ని ఎయిర్‌లైన్స్‌తో పాటు తమ చెక్-ఇన్ సిస్టమ్‌లు కూడా ప్రభావితమయ్యాయని, అందుకే విమానాలు ఆలస్యమయ్యాయని 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తెలిపింది. సిస్టమ్‌ను పునరుద్ధరించామని, అయితే పరిస్థితి చక్కబడే వరకు కొన్ని విమానాలు ఆలస్యంగా నడవొచ్చని వివరించింది. అయితే, అంతా సర్దుకుందని ప్రకటించిన రెండు రోజులకే అదే తరహా సమస్య పునరావృతం కావడంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. తాజా ఘటనపై ఎయిర్‌లైన్స్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.





## రష్యాలో భారతీయ విద్యార్థి

# అనుమానాస్పద మృతి

**లక్ష్మణ్‌గఢ్, నవంబర్ 7:** పాలు కొనడానికి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. 19 రోజుల తర్వాత అతని మృతదేహం ఓ నదిలో దొరికింది. రాజస్థాన్‌లోని లక్ష్మణ్‌గఢ్ పరిధిలోని కఫన్‌వాడ గ్రామానికి చెందిన అజిత్ సింగ్ చౌధరి అనే యువకుడు.. రష్యాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు. యూఫా నగరంలో ఉంటున్న అతడు అక్టోబర్ 19న ఉదయం 11 గంటల సమయంలో పాలు కొనుగోలు చేయడానికి వెళ్తున్నానని చెప్పి హాస్టల్ నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో అదృశ్యమైన అతని గురించి పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం అతని మృతదేహం వైట్ రివర్ డ్యామ్‌లో లభించింది. అయితే దీనిపై రష్యాలోని ఇండియన్ ఎంబసీ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. కానీ అతని మృతికి సంబంధించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. 19 రోజుల క్రితమే నది ఒడ్డున అతని దుస్తులు, మొబైల్ ఫోన్, బూట్లు లభించాయని విదేశాంగ శాఖ మాజీ మంత్రి జితేంద్ర సింగ్ అల్వార్ వెల్లడించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో యువకుడితో ఏదో అసహ్యకరమైన ఘటన జరిగిందని ఎక్స్ వేదికగా ఆయన ఆరోపించారు. ఎన్నో ఆశలతో అతని కుటుంబ సభ్యులు వైద్యవిద్యను అభ్యసించేందుకు 2023లో రష్యాకు పంపించారు. అయితే అతని మృతదేహం నదిలో లభించిందని ఈ రోజు వచ్చిన వార్త దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు.

# పాక్ పత్రిక ది ఫాంటియర్ కథనాలు

## ఆగ్రహం వ్యక్తం చేసిన రష్యా

**మాస్కో, నవంబర్ 7:** పాకిస్థాన్‌కు చెందిన పత్రికల తీరుపై మాస్కో మండిపడ్డది. వ్యతిరేక, అసత్య కథనాలు రాయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ది ఫ్రాంటియర్ పోస్టు అనే ఆంగ్ల భాషా దిన పత్రికపై రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. మాస్కోకు వ్యతిరేకంగా ఈ పత్రిక కథనాలు ప్రచురిస్తోందని ఆరోపించింది. ఈ మేరకు పాక్‌లోని రష్యా రాయబార కార్యాలయం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. ది ఫ్రాంటియర్‌లో రష్యన్ వ్యతిరేక కథనాలను మేం గమనించాం. ఈ పత్రికకు సంబంధించిన ప్రధాన కార్యాలయం వాషింగ్టన్‌లో ఉన్నందున దీన్ని పాకిస్థానీ అని పిలువలేము. పత్రిక తన సంపాదకీయంలో నిరంతరం రష్యా విదేశాంగ విధానం, నాయకత్వాన్ని విమర్శిస్తూ కథనాలు ప్రచురిస్తుందని పేర్కొంది. ఇతర దేశాల అజెండాపై కథనాలను ఎంపిక చేసే విషయంపై అమెరికనైజ్డ్ బృందం బాధ్యత వహిస్తుందని.. అది రష్యా విదేశాంగ విధానాలకు, అధ్యక్షుడు పుతిన్ విమర్శకులకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించింది. తమ దేశానికి సానుకూలంగా ఉండే ఒక్క కథనం కూడా ఈ పత్రికలో రాలేదని పేర్కొంది. అఎ÷-గాన్ వార్తలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ఈ వార్తా పత్రిక.. మాస్కో ఫార్మాట్ ఆఫ్ కన్సల్టేషన్స్‌ను పూర్తిగా విస్మరించడం గమనార్హం అని వెల్లడించింది.

# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వంలో ప్రీమియం సకాలంలో చెల్లించామని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. ఆచార్య ఎన్జీరంగా 125వ జయంతి ఉత్సవాల్లో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతును ఆదుకునేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. మొన్నటి తుపానులో నష్టపోయిన రైతులను ఆదుకున్నాం. మేం వచ్చాక పంటల బీమా చెల్లించి రైతులకు అండగా నిలిచాం. పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చర్యలు తీసుకున్నాం. పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇస్తున్నాం అని వివరించారు. జలాశయాల్లో పుష్కలంగా నీళ్లు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నాం. రాయలసీమలో అన్ని రిజర్వాయర్లు పూర్తి చేశాం. కరవును శాశ్వతంగా నివారించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టాం. తరచుగా వచ్చే తుపాన్ల వల్ల కూడా రైతులు నష్టపోతున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలో ప్రాజెక్టుల నిర్వాహణని గాలికొదిలేశారని, కనీసం గేట్లకు గ్రీజు కూడా పెట్టలేదని చంద్రబాబు నాయుడు ఆరోపించారు. 2014 నుంచి 2019 మధ్యలో వ్యవసాయ రంగంలో జీఎస్డీపీ 6 శాతం పైగా పెరిగిందని.. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జీఎస్డీపీ మళ్లీ పడిపోయిందని ఆక్షేపించారు.రైతులకు పంటల బీమా చెల్లింపులో ఇబ్బంది లేకుండా చేశామని చెప్పుకొచ్చారు. కౌలు రైతులు ఎక్కువ భూమిలో వ్యవసాయం చేస్తున్నారని.. నష్టాలు వస్తే ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు.ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతితో పాటు వందేమాతరం 150 వసంతాల వేడుకలు ఒకే రోజు రావటం చరిత్ర అని అభివర్ణించారు. ఆచార్య ఎన్జీ రంగా 33 ఏళ్ల వయస్సులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని నడిపించారని కొనియాడారు. 1964లో రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని పార్లమెంట్‌లో ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని కీర్తించారు. ప్రాంతాలకు అతీతంగా నాలుగుచోట్ల ఎంపీగా గెలిచిన చరిత్ర ఆచార్య ఎన్జీ రంగాది అని ప్రశంసించారు. స్వాతంత్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖుల్లో ఎన్జీ రంగా ఒకరని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. ఆర్థిక శాస్త్రంలో నైపుణ్యత సాధించిన రంగా.. మహాత్మాగాంధీ పిలుపుతో స్వాతంత్య పోరాటంలో పాల్గొన్నారని నొక్కిచెప్పారు. సైమన్ కమిషన్ గో బ్యాక్, క్విట్ ఇండియా ఉద్యమంలో ఆచార్య ఎన్జీ రంగా పాల్గొన్నారని కీర్తించారు. కేవలం 33 ఏళ్ల వయసులో ఆంధ్రా రైతాంగ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని కొనియాడారు. రైతులకు శిక్షణా పాఠశాల పెట్టి శిక్షణ అందించారని ఉద్ఘాటించారు. ఓవైపు దేశం కోసం మరో వైపు రైతుల కోసం ఆచార్య ఎన్జీ రంగా పోరాడారని నొక్కిచెప్పారు. ఆచార్య ఎన్జీ రంగా పార్లమెంట్‌లో ఉన్నంత కాలం రైతులు సుభిక్షంగా ఉంటారని నెహ్రూ వంటి వారు చెప్పారని ఉద్ఘాటించారు. ఆచార్య ఎన్జీ రంగా చేసిన పోరాటాలకు పద్మ విభూషణ్‌తో పాటు ఎన్నో అవార్డులు వచ్చాయని కీర్తించారు. తాను మొదటిసారి సీఎం కాగానే వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఆచార్య ఎన్జీ రంగా పేరు పెట్టానని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత యూనివర్సిటీ పేరు మార్చారని తెలిపారు. దీంతో ఏపీలో రంగా పేరిట వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ప్రాంతాలకు అతీతంగా నాలుగు పార్లమెంట్ స్థానాల్లో ఎంపీగా గెలిచిన అరుదైన వ్యక్తి ఎన్జీ రంగా అని ప్రశంసించారు. ఆయన స్ఫూర్తితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై పీహెచ్డీ కోసం పని చేశామని ఉద్ఘాటించారు. దేశం కోసం పిల్లలు వద్దనుకుని జీవించిన రంగా దంపతులు ఆదర్శనీయులని కొనియాడారు. తాను మొదటి సారి మంత్రి అయిన సందర్భంగా ఎన్జీ రంగా కూడా మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు. ఎన్డీయే ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. ప్రజల కోసం రైతు నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. తాను ఐటీని ప్రోత్సహించి ఎందరో రైతు బిడ్డలను ఐటీ ఉద్యోగాల వైపు వెళ్లేలా చేశానని నొక్కిచెప్పారు. వ్యవసాయంలో ఖర్చులు తగ్గించి రైతుల ఆదాయం పెంచటంపై పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. రైతులకు ఆదాయం పెరగాలంటే ఖర్చులు తగ్గాలి, దిగుబడి పెరగాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో ధాన్యం రైతులకు 24 గంటల్లోగా డబ్బులు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం కోసం రూ.3 వేల కోట్లు ఇచ్చామని గుర్తుచేశారు సీఎం చంద్రబాబు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

## విమెన్ క్రికెటర్ శ్రీచరణికి రూ.2.5 కోట్ల నగదు పురస్కారం



**అమరావతి :** వన్డే ప్రపంచకప్‌లో సత్తా చాటిన తెలుగు తేజం, మహిళా క్రికెటర్ శ్రీచరణిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘనంగా సత్కరించింది. శ్రీచరణికి రూ. 2.5 కోట్ల నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఆమెకు గ్రూప్ 1 ఉద్యోగంతోపాటు.. కడపలో ఇంటి స్థలాన్ని ప్రభుత్వం ఇవ్వనుంది. ఇండియన్ ఉమెన్ క్రికెటర్ శ్రీచరణి, మాజీ కెప్టెన్ మిథాలి రాజ్ శుక్రవారం ఉదయం సీఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును వారు కలిశారు. క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఇరువురికి మంత్రి నారా లోకేష్ స్వాగతం పలికారు. ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ గెలుచుకున్నందుకు శ్రీచరణిని సీఎం, మంత్రి అభినందించారు. ఆపై శ్రీచరణి, మిథాలితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరల్డ్ కప్ గెలుచుకున్న ఆనందక్షణాలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌తో శ్రీచరణి పంచుకున్నారు. ఉమెన్ వరల్డ్ కప్ గెలుచుకోవడం ద్వారా భారత దేశ మహిళలు సత్తా చాటారని, మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలిచారని ముఖ్యమంత్రి కొనియాడారు. ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఉమెన్ క్రికెట్ వరల్డ్ కప్ టీమ్ విన్నర్ శ్రీచరణికి ఘన స్వాగతం లభించింది. శ్రీచరణికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, మంత్రులు అనిత, సవిత, సంధ్యారాణి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు విమానాశ్రయంలో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీలు, మంత్రులు, శాప్ ఛైర్మన్ కలిసి శ్రీచరణి, మిథాలి రాజ్‌ను వెంటపెట్టుకుని సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. అయితే గన్నవరం నుంచి బెంజ్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించాలని ఏసీఏ మొదట భావించింది. ముఖ్యమంత్రితో భేటీ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీని రద్దు చేశారు. చంద్రబాబును కలిసిన తర్వాత మంగళగిరిలోని క్రికెట్ స్టేడియంను సందర్శించేందుకు శ్రీచరణి బయలుదేరి వెళ్లారు. అలాగే.. నేడు సొంత జిల్లా కడపకు శ్రీచరణి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆంధక్రికెట్ అసోషియేషన్ సౌజన్యంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్.. శ్రీచరణిని ఘనంగా సత్కరించనుంది. క్రికెటర్ శ్రీచరణి శుక్రవారం ఉదయం సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. అందరి అభిమానం చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. కుటుంబం నుంచి నాకు చక్కటి ప్రోత్సాహం ఉంది. మా మామ నన్ను క్రికెట్ ఆడించేవారు. నేను ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో శిక్షణ పొందాను. ఇది మొదటి అడుగు మాత్రమే.. ముందు చాలా ఉంది. ప్రధాని మోదీని కలిసినప్పుడు భవిష్యత్ కార్యాచరణపై సలహాలిచ్చారని అన్నారు.

## రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్

**రూ.1,772 కోట్లతో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు!**

**1,200 క్యూబిట్ సామర్థ్యముతో నిర్మాణం**

**50 ఎకరాలు కేటాయించిన సీఆర్డీఏ**

**జనవరి నాటికి కార్యకలాపాలకు సిద్ధం!?**

**అమరావతి :** ప్రముఖ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ స్థాపనకు శ్రీకారం చుట్టింది. ఏకంగా రూ. 1,772.08 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదించింది. ఇందులో భాగంగా అమరావతి క్వాంటమ్ వ్యాలీలో 1,200 క్యూబిట్ సామర్థ్యమున్న (50 లాజికల్ క్యూబిట్స్) భారీ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయనుంది. క్వాంటం వ్యాలీ భవనానికి ఆనుకుని 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ప్రత్యేక భవనంలో మైక్రోసాఫ్ట్ ఈ సౌకర్యాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి, ఈ భవనానికి క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ 50 ఎకరాలు కేటాయించింది. ప్రభుత్వ ప్రకటన మేరకు క్వాంటం వ్యాలీ టెక్ పార్క్ జనవరి 1, 2026 నాటికి కార్యకలాపాలకు సిద్ధంగా ఉంటుంది. ఇది దేశీయ, విదేశీ క్లయింట్‌లకు సేవలందించడానికి దశలవారీగా 90,000 చదరపు అడుగుల అంతర్నిర్మిత ప్రాంతంలో సూపర్ కంప్యూటర్‌లను ఉంచనుంది. 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు ఇప్పటికే ఐబీఎం సంస్థ ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది.'అమరావతి క్వాంటం వ్యాలీ డిక్లరేషన్'ను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూపొందించింది. ఇది జనవరి 1, 2029 నాటికి ఈ రంగంలో 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్వాంటం టెక్నాలజీలను అభివృద్ధి చేయడం, సిలికాన్ వ్యాలీ తరహాలో శక్తివంతమైన ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థను సృష్టించడంపై దృష్టి సారించడానికి అమరావతిని దేశంలోని మొట్టమొదటి క్వాంటం వ్యాలీగా మార్చడం ఈ ప్రకటన లక్ష్యం. మరోవైపు క్వాంటమ్ వ్యాలీలో పెట్టుబడులు పెట్టేందుకు మరిన్ని సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. జపాన్‌కు చెందిన ఫుజిసు 64 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ కింద అందించే నిధులకు మరో 50 శాతం వెచ్చించి ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తెచ్చింది. క్వాంటమ్ వ్యాలీలో పరిశోధనలకు దశల వారీగా 90 లక్షల చదరపు అడుగుల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలని ప్రభుత్వం యోచిస్తుంది. ప్రస్తుతం నిర్మించనున్న ఐకానిక్ టవర్ వల్ల 40 వేల చదరపు అడుగులు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు దేశంలోనే మొట్టమొదటి ఫుల్ స్టాక్ క్వాంటం వ్యాలీ టెక్ పార్క్‌ను స్థాపించడానికి ప్రభుత్వంతో సహకరించడానికి ఐబీఎం ఇప్పటికే తేసీఎస్, ఎల్ఎన్టీ లతో అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఇటీవల జరిగిన క్వాంటం వ్యాలీ వర్క్‌షాప్‌లో ఐబీఎం దాని తాజా 156-క్విట్ హెూరాన్ ప్రాసెసర్ మోడల్‌ను కూడా ప్రదర్శించింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న క్వాంటం సైన్స్, దాని అనువర్తనాలపై అవగాహన కల్పించడానికి ఐక్యరాజ్యసమితి ఇప్పటికే 2025 ను అంతర్జాతీయ క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ సంవత్సరంగా ప్రకటించింది. క్వాంటం అనేది గేమ్-ఛేంజింగ్ టెక్నాలజీ. ఇది 2030 నాటికి వేగంగా అభివృద్ధి చెందనున్నట్లు నిపుణులు భావిస్తున్నారు.

## రాయచోటి అభివృద్ధిపై చర్చిద్దాం రండి

**మంత్రి మండిపల్లికి గడికోట శ్రీకాంత్ సవాల్**



**కడప :** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పై వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇష్టానుసారం ఆరోపణలు చేయడం, ప్రజల్లో ద్వేషాలు రేపేలా మాట్లాడడం సరైంది కాదని ఆయన మండిపడ్డారు. రాయచోటి అభివృద్ధి గురించి చర్చించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. మీరు అధికారులతో కలిసి రండి. నేను ఒక్కడినే వస్తా.. గత ఐదు సంవత్సరాల్లో ఏం చేశానో చూపిస్తా, అని సవాల్ విసిరారు.. తాను రేపటి తరాల కోసం పనిచేస్తానని, తొడలు కొట్టడం, మీసాలు తిప్పడం కాదు ? అభివృద్ధి చేయడం ముఖ్యం అని వ్యాఖ్యానించారు. ఇక, కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అవుతుందని, ఈ కాలంలో మంత్రి రాంప్రసాద్ ఏం అభివృద్ధి చేశారో ప్రజల ముందు చెప్పాలని డిమాండ్ చేశారు గడికోట.. నిండు శాసనసభలో రాయచోటి గురించి ఆదోని ఎమ్మెల్యే అవమానకరంగా మాట్లాడినప్పుడు మీరు మౌనం ఎందుకు వహించారు? ఆ రోజే ఛాలెంజ్ చేయాల్సింది అని సూచించారు.. ప్రస్తుత కేబినెట్‌లో క్యాబినెట్‌లోనే జిల్లాను విభజించే యత్నాలు జరుగుతున్నాయని, దానిని ఆపేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. తొడలు కొడతాం, మీసాలు తిప్పుతాం అంటూ బెదిరించడం వల్ల ఎవరూ భయపడరు. అభివృద్ధి గురించి మాట్లాడటానికి దమ్ము అవసరం లేదు అని గడికోట శ్రీకాంత్ రెడ్డి హితవు చెప్పారు.. చివరగా ఆయన మంత్రి రాంప్రసాద్‌ను సవాల్ చేస్తూ అన్నారు.. రాయచోటి అభివృద్ధిపై చర్చకు రెడీ.. నేను వస్తా? మీరు రండి.. అభివృద్ధి పై చర్చిద్దాం అని ఛాలెంజ్ చేశారు.

## స్వాతంత్ర్య పోరాటంలో రణనినాదంగా వందేమాతరం



మొదటి పేజీ తరువాయి

పిలుపునిచ్చారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం, కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు స్వాతంత్ర్య పోరాటంలో ఒక రణనినాదంలా పనిచేసిందని పవన్ కొనియాడారు. సమరయోధులకు మనోబలాన్ని, దేశ ప్రజలకు ఉద్యమ స్ఫూర్తిని అందించిందని గుర్తుచేశారు. ఈ గేయం ప్రాముఖ్యతను, దాని ఘన చరిత్రను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఒకే సమయంలో ఈ గేయాన్ని ఆలపించాలని నిర్ణయించిందని ఆయన వివరించారు. "శుక్రవారం ఉదయం 10 గంటలకు మనమందరం వందేమాతరం గేయాన్ని ఆలపిద్దాం. మన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని సజీవంగా నిలుపుకుందాం" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## నిధులు అందుబాటులో ఉన్నా నిర్లక్ష్యమా

**అధికారుల తీరుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అసహనం**

**అమరావతి :** తన శాఖలోని ఇంజనీరింగ్ అధికారుల పని తీరుపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ.. పనులు ఆశించినంత వేగంగా జరగడం లేదంటూ అధికారులను నిలదీశారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో పవన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె పండగ 2.0, అడవి తల్లి బాట పనుల పురోగతి, జల్ జీవన్ మిషన్, స్వమిత్వ పథకం సహా ప్రధాన కార్యక్రమాల అమలు స్థితిపై పవన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, పర్యవేక్షణ కోసం త్వరలో జియో రూరల్ రోడ్ మేనేజ్మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెడతామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రాథమిక దశలో అడవి తల్లి బాట ప్రాజెక్టును ఈ కొత్త టెక్నాలజీకి అనుసంధానం చేస్తామని వెల్లడించారు. ఇక సాస్కీ నిధులతో పల్లె పండగ 2.0 అమలు జరుగుతుందని తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టి జల్ జీవన్ మిషన్ మరియు స్వమిత్వ పనులను స్వయంగా పర్యవేక్షిస్తానన్నారు. మార్చి నాటికి కోటి స్వమిత్వ కార్డులు ప్రజలకు పంపిణీ చేస్తామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అలాగే సుమారు 761 గిరిజన గ్రామాలను అనుసంధానించే 662 రహదారుల నిర్మాణానికి 1,158 కోట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. మరో 2,123 కోట్ల సాస్కీ నిధులతో 4,007 కిలోమీటర్ల గ్రామీణ రహదారులు, గోకులాలు మరియు డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ఉద్యమం



మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన పోస్టర్‌ల ఆవిష్కరణ, కోటి సంతకాలు, రచ్చబండ కార్యక్రమాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు.. ఈ నెల 12న నియోజకవర్గాల్లో జరిగే ర్యాలీలకు అన్ని పార్టీలను, ప్రజా సంస్థలను కలుపుకుని పాల్గొనాలని సూచించారు. పార్టీ కమిటీలు, డేటా డిజిటలైజేషన్‌పై ప్రతి ఒక్కరూ సీరియస్‌గా దృష్టిపెట్టాలి. పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని ఆయన సూచించారు. ప్రభుత్వం దిగివచ్చే వరకూ పోరాటం ఆగదు.. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే నాటికి అంతా పకడ్బందీగా సిద్ధం కావాలి అని.. పార్టీ రీజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లకు పిలుపునిచ్చారు సజ్జల రామకృష్ణా రెడ్డి.. అంతేకాక, ప్రజలకు మరింత చేరువయ్యేలా గొంతెత్తి నినదించాలి. ప్రతి ఒక్కరూ మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో పనిచేయాలి అని సూచించారు సజ్జల రామకృష్ణారెడ్డి.. కాగా, రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేస్తామని కూటమి ప్రభుత్వం చెబుతుండగా.. పీపీపీ అంటే.. ఇది పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు మెడికల్ కాలేజీలను అప్పగించడమే అని వైఎస్ఆర్ కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు.. మెడికల్ కాలేజీలపై ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నారు.

## వ్యోమగామి శిక్షణకు ఎంపికైన నిడదవోలు యువతి

**2029లో అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతున్న కైవల్య**

**ఫ్లోరిడాలో నాలుగేళ్ల పాటు కొనసాగనున్న శిక్షణ**

**అమరావతి :** ఏపీకి చెందిన ఓ యువతి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అంతరిక్షంలోకి అడుగుపెట్టే తన కలను సాకారం చేసుకునే దిశగా కీలక మైలురాయిని దాటింది. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన కుంచల కైవల్య రెడ్డి, అమెరికాలో నిర్వహించే ప్రతిష్ఠాత్మక వ్యోమగామి శిక్షణకు ఎంపికైంది. ఫ్లోరిడాలోని 'టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్' ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణ కోసం ప్రపంచవ్యాప్తంగా 36 దేశాల నుంచి వేలాది మంది పోటీ పడగా, కేవలం 150 మంది మాత్రమే అర్హత సాధించారు. వారిలో కైవల్య రెడ్డి ఒకరిగా నిలవడం విశేషం. ఈ శిక్షణ నాలుగేళ్ల పాటు కొనసాగనుంది. దీనిని విజయవంతంగా పూర్తి చేసిన వారు 2029లో అంతరిక్ష యాత్రకు వెళ్లనున్నారు. ఈ యాత్రలో భాగంగా వ్యోమగాములు భూమి నుంచి 300 కిలోమీటర్ల ఎత్తులో కక్ష్యలో పరిభ్రమించనున్నారు. మొత్తం 5 గంటల పాటు సాగే ఈ మిషన్‌లో సుమారు 3 గంటల పాటు జీరో గ్రావిటీలో గడుపుతారు. కైవల్యకు నాసా మాజీ వ్యోమగామి, 224 రోజులు అంతరిక్షంలో గడిపిన విలియం మెక్ఆర్థర్, బ్రెజిల్ తొలి వ్యోమగామి మార్కోస్ పోంటెస్ వంటి ప్రముఖ నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. కైవల్య రెడ్డి తండ్రి కుంచాల శ్రీనివాసరెడ్డి, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆమె తల్లి విజయలక్ష్మి గృహిణి. తనకు చిన్నప్పటి నుంచే అంతరిక్షం, ఖగోళ శాస్త్రంపై ఆసక్తి ఉండేదని కైవల్య తెలిపింది. భవిష్యత్తులో జర్మనీలో ఆస్ట్రోఫిజిక్స్ చదివి ఖగోళ శాస్త్రవేత్త కావాలన్నదే తన లక్ష్యమని పేర్కొంది. 17 ఏళ్లకే ఈ ఘనత సాధించిన కైవల్య, గతంలోనూ తన ప్రతిభను చాటుకుంది. 2023లో నాసా ఆధ్వర్యంలో జరిగిన 'అంతర్జాతీయ ఎయిర్ అండ్ స్పేస్ ప్రోగ్రాం' కు కూడా ఎంపికైంది. ఆ కార్యక్రమంలో భాగంగా ఆమె అమెరికాలోని అలబామాలో 15 రోజుల పాటు శిక్షణ పొందింది. సైన్స్ పట్ల ఆమెకున్న ఆసక్తి, పట్టుదలే ఈ అరుదైన అవకాశాలను అందిస్తున్నాయని పలువురు అభినందిస్తున్నారు.

# మునిసిపల్ స్థలాల ఆక్రమణలపై సిపిఐ నేత సలాం ఆగ్రహం

**ఖమ్మం , నవంబర్ 7 : ( సమయం న్యూస్ ) :**మున్సిపల్ స్థలాల ఆక్రమణల పై సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం ఆగ్రహం వ్యక్తం చేశారు. సలాం తో పాటు ఆ పార్టీ నాయకులు శుక్రవారం.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కి చెందిన దానేయగూడెం పార్కు వాటర్ ఫిల్టర్ బెడ్స్ ను సందర్శించి , పరిశీలించారు. మునిసిపల్ , మున్నేరు భూములు పట్టపగలు కబ్జాకు గురై వెంచర్లు చేస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదని ఆగ్రహించారు. అనేకసార్లు సిపిఐ నాయకులు ఆర్డీవో కి ,మున్సిపల్ కమిషనర్ కి ఫిర్యాదు చేసిన కూడా వారిలో చలనం లేదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మహమ్మద్ సలాం తీవ్రంగా విమర్శించారు ఈరోజు స్థానిక దానవయిగూడెం పార్కు వాటర్ ఫిల్టర్ బెడ్స్ గుట్టను సందర్శించారు . సర్వే నెంబర్ల పేరుతో మాయాజాలం సృష్టిస్తున్నారని , ఒకవేళ ప్రైవేట్ భూములు అయితే అప్పు డు ఎందుకు ట్యాంకులు కట్టారు , ఇప్పుడు ఎందుకు గుట్టల ను కూల గోడుతున్నారు అంటూ ప్రశ్నించారు. మున్నేరు సంబంధించిన భూములను ప్రభుత్వ లెక్కల పై వెంటనే జిల్లా కలెక్టర్ గారు చొరవ తీసుకొని తాజా సర్వే చేయాలని , ప్రభుత్వ భూమిని రక్షించాలని డిమాండ్ చేశారు . ఈ భూములలో వెంచర్లు వేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని సలాం డిమాండ్ చేశారు. ఖమ్మం నగరంలో ఎక్కడైన చిన్న డబ్బా వేసుకుంటే హడావుడి చేసే అధికారులు , ప్రజాప్రతినిధులు ఇంత కబ్జా అవు తున్నా , రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న పట్టిం చుకోకపోవడం సిగ్గుచేటైన విషయమని మండిపడ్డారు. పరిస్థితి ఇలాగే ఉంటే , అవసరమైతే తమ పార్టీ ఆధ్వ ర్యంలో ఈ భూములలో పేదలతో గుడిసెలు వేపిస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యానాల సాంబశివరెడ్డి , త్రీ టౌన్ కార్యదర్శి నూనె శశిధర్ , నరసింహారావు , ఎండి . రహిమాన్ ,దుర్గానాథ్ ,ఎస్ కే. ఛానల్ తదితరులు పాల్గొన్నారు.



# సంగారెడ్డి జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పారిశుధ్య సమస్యపై కలెక్టర్ ఆగ్రహం

- పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని
- సస్పెన్షన్ చేయాలని ఆదేశం
- పదవ తరగతి ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి.
- ఎఫ్ ఆర్ ఎస్ ను సక్రమంగా వినియోగించాలి.



**సంగారెడ్డి నవంబర్07( సమయం న్యూస్,).:** సంగారెడ్డి పట్టణం లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పారిశుద్ధ సమస్యపై కలెక్టర్ పి. ప్రావీణ్య, ప్రధానోపాధ్యాయులు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంగారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాంశాలల్లో శానిటేషన్ సమస్య, ఎఫ్ఆర్ఎస్ సిస్టం సరిగా అమలు చేయకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా పాఠశాలలో మూత్రశాలలు మరుగుదొడ్లను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడం తో పాటు , పాఠశాలలో శానిటేషన్ సమస్య కలెక్టర్ దృష్టికి రావడంతో పాఠశాల ప్రధానోపా ధ్యాయురాలు రోజాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని సస్పెన్షన్ చేయాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ను ఆదేశించారు . పాఠశాలలో సానిటేషన్ సిబ్బందిని తొలగించి నూతన శానిటేషన్ సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తరగతి గదులను సం దర్శించారు . ఎఫ్ఆర్ఎస్ సిస్టం పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణులు అయ్యేలా ఇప్పటి నుండే ఉపాధ్యా యులు, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు సిబ్బంది కృషి చేయాలని ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.

# ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఏడీఏ-కే. శంకర్ రాథోడ్

- ఎరువులు గాని పురుగుల మందులు గాని
- రైతులకు ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటాం-ఏడీఏ



**కొడంగల్ మున్సిపాలిటీ (మం)నవంబర్,07(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలో గల ఎరువుల దుకాణాలను సహాయసంచాలకులు కే. శంకర్ రాథోడ్ తనిఖీ చేయడం జరిగింది. ఈ యొక్క తనిఖీ లో ఎరువుల,పురుగుమందుల స్టాకు రిజిస్టర్లను, నిలువలను తనిఖీ చేయడం జరిగినది ఈ సందర్భంగా ఈ యొక్క యాసంగి పంటలకు కావలసిన ఎరువులు, పురుగు మందులు మరియు సస్యరక్షణకు సంబంధించిన మందులను షాపులలో రైతుల కోసం అందుబాటులో ఉంచాలని డీలర్లకు తెలిపారు ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన నిలువల బోర్డులు ధరల పట్టికను ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలని డీలర్లకు తెలిపారు. అధిక ధరలకు ఎరువులు గాని పురుగుమందులు గాని రైతులకు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తనిఖీ సందర్భంగా దుకాణ యజమానులకు ఏడీఏ కే శంకర్ రాథోడ్ హెచ్చరించారు.

## ఘనంగా జిల్లా పోలీస్ కార్యలయం లో "వందే మాతరం" జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుక

-జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి,ఐపీఎస్.



**వికారాబాద్,నవంబర్,07(సమయం న్యూస్) :** దేశభక్తి, ఐక్యత, జాతీయ గౌరవానికి ప్రతీకగా నిలిచిన "వందే మాతరం" జాతీయ గీతం 150 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని, వికారాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో "వందే మాతరం" గీతం 150 సంవత్సరాల వేడుకలను జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి,ఐపీఎస్ ఆద్వర్యం లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు,డిపిఓ సిబ్బంది,హెూం గార్డ్స్ అధికారులు అందరూ సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించడం జరిగింది. అనంతరం ఇట్టి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "వందే మాతరం" గీతం మన స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచిందని, ఈ గీతం భారత మాత పట్ల ఉన్న భక్తి, త్యాగం, మరియు దేశాభిమానానికి ప్రతీక అని తెలిపారు. ఈ వేడుకలు ప్రతి భారతీయునిలో దేశభక్తిని, ఐక్యతను, జాతీయ గౌరవాన్ని మరింత బలపరుస్తాయని అన్నారు.జాతీయ గీతం పట్ల గౌరవభావాన్ని పెంపొందించాలని, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఇట్టి కార్యక్రమం లో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి,ఏఆర్ డిఎస్పీ వీరేష్ ,ఏఓ ఖజామోహెూయోద్దీన్,డిఎస్బి ఇన్స్పెక్టర్ డివిపి రాజు, ఆర్ఐ లు అంజాత్ పాషా,దేవిడ్,ఎస్సై లు,ఆర్ఎస్ఐ లు,డిపిఓ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

# జూబ్లీహిల్స్ లో ఖమ్మం బీ జే పీ నేతల ప్రచారం



**ఖమ్మం, నవంబర్ 7 : ( సమయం న్యూస్ ) :** బీ జే పీ జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ఖమ్మం జిల్లా నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. బోరుబండలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు నారపరాజు రామచంద్ర రావు కలసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు , ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు మండపు పుబ్బారావు , దుద్దుకురి కార్తీక్ , రుద్రగాని మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

# వందే మాతరం సామూహిక గేయ ఆలాపన.



**మేడ్చల్ మల్కాజిగిరి నవంబర్07( సమయం న్యూస్.) :** "వందే మాతరం" జాతీయ గీతాన్ని బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ గేయాన్ని సామూహిక గానం చేయడం జరిగిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, జిల్లారెవెన్యూ అధికారి హరిప్రియతో కలసి ఉదయం 10.00 గంటలకు "వందే మాతరం" గేయాన్ని సామూహికంగా ఆలపించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, టిఎస్ఎస్ కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.


# రోడ్డు మరమ్మతు చేసిన బిజెపి నాయకులు కమ్మరి శ్రీనివాస్




**సమయం న్యూస్ గజ్వేల్ నవంబర్ 7 :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రహదారి వర్షం కారణంగా రోడ్డు గుంతల మయంగా అయింది రోజు వెళ్లే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి ఇట్టి రోడ్డును అధికారులు ఎవ్వరు పట్టించుకునే దాఖలాలు లేకుండా గజ్వేల్ లో అయింది దీనిని దృష్టిలో ఉంచుకొని బిజెపి నాయకులు ఈరోజు రోడ్డును పూడ్చడం జరిగింది.గజ్వేల్ స్థానిక ఎమ్మెల్యే ఫామ్ హౌస్ కి పరిమితమయ్యాడు గజ్వేల్ లో పాలన అస్తవ్యస్తంగా తయారు అయ్యింది గత కొన్ని రోజుల నుండి ఈ రోడ్డు గురించి ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే దాఖలాలు లేకుండా అయ్యింది అందుకే ఈరోజు స్థానిక బిజెపి నాయకులు చందాలు వేసుకుని రోడ్డును మరమ్మత్తు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా టెలికాం బోర్డు మెంబర్ కమ్మరి శ్రీనివాస్ బిజెపి నాయకులు, సిద్దిపేట జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆలేటి సుమతి, గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్, గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి బారు అరవింద్, పట్టణ ఉపాధ్యక్షులు వడ్డేపల్లి ప్రసాద్ , చెన్నోజి నీరజ, మహిళా మోర్చా అధ్యక్షురాలు కుంకుమరాణి, బిజెపి నాయకులు ఎల్లా బాబు, కొమ్ము అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నెలాఖరు లోపు లక్ష్యం మేరకు చేప పిల్లలను విడుదల చేయాలి

- జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ శ్రీజ



**ఖమ్మం, నవంబర్ :( సమయం న్యూస్ ) ఈ :** నెలాఖరు లోపు లక్ష్యం మేరకు చేప పిల్లలను విడుదల చేయాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.జిల్లా ఇంచార్జి కలెక్టర్ శుక్రవారం ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో చేప పిల్లల పంపిణీ చేసేబి, డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ను పరిశీలించారు. అనంతరం ఆరెంపుల బారుగూడెం నల్ల చెరువులో చేప పిల్లలను విడుదల చేసారు. డిస్ట్రిబ్యూషన్ కమిటీ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల సజావుగా జరగాలని అన్నారు.ఆరెంపుల బారుగూడెం నల్ల చెరువులో 28 వేల 800 చేప పిల్లలు విడుదల చేయాల్సి ఉన్నదని, రవ్వ, బొచ్చ, బంగారు తీగ రకాల చేప పిల్లలను శుక్రవారం నల్ల చెరువులో విడుదల చేయడం జరిగిందని, అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని 38 చెరువులలో 9.5 లక్షల చేప పిల్లలు నెలాఖరు లోపు విడతల వారీగా విడుదల చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఎంపిడిఓ కె. రవికుమార్, ఎంపీవో శ్రీదేవి, ఫిషరీస్ మండల ఇంచార్జ్ లు నవీన్, లక్ష్మణ్, సరిత, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ తూర్పు లోని పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన నన్నపునేని నరేందర్ .





**వరంగల్ నవంబర్ 7.(సమయం న్యూస్):** ఈరోజు వరంగల్ తూర్పునియోజకవర్గలోని

1) మహాత్మా గాంధీ ఫంక్షన్ లో చింతపట్ల సదానందం గారి కుమారుని వివాహానికి మరియు

2) ఖమ్మం రోడ్ లోని సత్యం గార్డెన్స్ లో ఆంధ్రజ్యోతి రిపోర్టర్ కోరుకోప్పుల నరేందర్ గారి కుమారుడి వివాహానికి మరియు

3) ఉరుసుగుట్ట లోని ఆకుతోట కన్వెన్షన్ హాల్లో శంకేసి శ్రీనివాస మూర్తి గారి కుమార్తె వివాహానికి

4) ములుగు రోడ్ లోని వజ్రా గార్డెన్స్ లో మన తెలంగాణ రిపోర్టర్ వెంకటేశ్వర్లు గారి కుమారుని వివాహానికిపలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను"మీ వివాహ జీవితం సంతోషకరంగా, శాంతిమయంగా, ప్రేమతో నిండిపోవాలని మనసారా కోరుకుంటున్నాను ." ఆశీర్వదించిన గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ %వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు శ్రీ నన్నపునేని నరేందర్ గారు మరియు ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జిలు మాజీ ప్రజా ప్రతినిధులు ముఖ్య నాయకులు మరియు యువజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కోస్గి బాలికల వసతి గృహాన్ని సందర్శించిన అసిస్టెంట్ డైరెక్టర్-ఎస్.సుబ్బా లక్ష్మీ

**కోస్గి మున్సిపల్ (మం)నవంబర్,07(సమయం న్యూస్)**

నారాయణ పేట జిల్లా కోస్గి సాంఘిక సంక్షేమ శాఖ బాలికలు, బాలుర వసతి గృహాలను షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (హైదరాబాద్) ఎస్. సుబ్బ లక్ష్మి శుక్రవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కోస్గి బాలికల వసతి గృహంలో వంటగదిని, నిత్యాసర సరకులను, మరుగు దొడ్లు,స్నానపు గదులను పరిశీలించారు. విద్యార్థులకు వండిన అల్పాహారాన్ని పరిశీలించారు. అనంతరం వసతి గృహ విద్యార్థినులతో కలిసి అల్పాహారం తిన్నారు. తర్వాత గుండుమల్ లోని బాలుర వసతి గృహాన్ని కూడా ఆమె సందర్శించి పరిశీలన చేశారు. అనంతరం ఆమె నారాయణ పేట కలెక్టరేట్ లో గల షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్యాలయ రికార్డులు, ఉద్యోగుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బ లక్ష్మి మాట్లాడుతూ..పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్కు సంబంధించి విద్యార్థుల బ్యాంక్ ఖాతాల సీడింగ్ను సంబంధిత కళాశాలలకు లను వినియోగించడం ద్వారా, బ్యాంకు ఖాతాల సీడింగ్ మరియు ఆధార్ సీడింగ్లను త్వరగా మరియు ఖచ్చితంగా చేయడానికి ఫాలో అప్ చేయాలని నారాయణపేట జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్ ను ఆదేశించారు. అలాగే ప్రీమెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి స్కాలర్షిప్ల మంజూరు కోసం హాస్టళ్లకు మ్యాప్ చేసిన ప్రీమెట్రిక్ విద్యార్థుల లక్ష్యాన్ని సంబంధిత పాఠశాలలకు లను నియమించడం ద్వారా పూర్తి చేయాలని సూచించారు.ఈపాస్ లాగిన్లో విద్యార్థుల పునరుద్ధరణకు వెంటనే అవసరమైన








చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోస్గి బాలికల హాస్టల్లో టాయిలెట్ల మరమ్మతులు మరియు విద్యుత్ వైరింగ్కు సంబంధించిన చిన్న పనులకు సంబంధించిన మరమ్మతు పనులను చేపట్టాలని అబ్దుల్ ఖలీల్ కు తెలిపారు. నారాయణ పేట జిల్లా ఆవిర్భావం తర్వాత నారాయణపేటలో ఎస్సీ,ఎస్టీ కళాశాల వసతి గృహం లేనందున కళాశాల హాస్టళ్లకు ప్రతిపాదనలు పంపించాలని ఖలీల్ కు సూచించారు. కళాశాల విద్యార్థుల డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని, విద్యుత్, టాయిలెట్లు మరియు ఇతర పనులతో సహా అన్ని హాస్టళ్ల మరమ్మతులకు సంబంధించిన పూర్తి అంచనాలను విడిగా అందిస్తే తద్వారా పనులు చేపట్టడానికి, కలెక్టర్కు పరిపాలనా అనుమతులు అందేలా చూసుకోవడానికి 2005- 26 గాను అవసరమైన అంశాలను గుర్తించడం ద్వారా వస్తువుల కోసం డీ పీ సీ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వసతి గృహ వార్డెన్లు,ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్, సిడిఆర్ అనాలిసిస్పై వికారాబాద్ జిల్లా పోలీసులకు ఒకరోజు వర్క్షాప్.

● జిల్లా ఎస్పీ కె. నారాయణరెడ్డి,ఐపిఎస్.





**వికారాబాద్, నవంబర్,07(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పోలీసులకు సైబర్ క్రైమ్, కాల్ డేటా రికార్డు సీడీఆర్ అనాలిసిస్పై జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో డీటిసి నిపుణులతో ఒకరోజు ప్రత్యేక వర్క్షాప్ విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేటి ఆధునిక యుగంలో సైబర్ నేరాలు గణనీయంగా పెరుగుతున్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే పోలీసు సిబ్బంది తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాల్ డేటా రికార్డు సీడీఆర్ విశ్లేషణ ద్వారా నేరాలను ఛేదించడంలో మరింత వేగం, స్పష్టత సాధ్యమవుతుందని వివరించారు. జిల్లాలో సైబర్ క్రైమ్ సంఘటనలను గణనీయంగా తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ముఖ్యంగా ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించాల్సిన ఆవశ్యకత గురించి అధికారులకు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ బి. రాములు నాయక్,ఎస్.శ్రీనివాసులు (డీఎస్పీ డి.టి సి వికారాబాద్), శ్రీనివాస్ రెడ్డి (డిఎస్పి వికారాబాద్), జానయ్య (డిఎస్పి, డిసిఆర్బి వికారాబాద్) తో పాటు, సిఐ అధికారులైన ఎన్. శ్రీధర్ రెడ్డి (కోడంగల్), ఎస్.శ్రీనివాస్ రెడ్డి (పరిగి), జి.వెంకట్ (మొమింపేట్), మరియు వై. నాగేశ్ (కరణ్ కోట్) హాజరయ్యారు. వీరితో పాటు 09 మంది ఎస్సైలు, 02 మంది హెచ్.సి.లు, మరియు 19 మంది పి.సి.లు సహా మొత్తం 34 మంది పోలీసు సిబ్బంది ఈ వర్క్షాప్లో పాల్గొని శిక్షణ వివరాలను తెలుసుకున్నారూ.

# ప్రజలను గూడ్స్ వాహనాల్లో రవాణా చేస్తే కఠిన చర్యలు

● టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు.



**నారాయణపేట,నవంబర్,07(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా వాహనాలు తనిఖీలు నిర్వహించగా కూలీలను వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... రవాణా చట్ట ప్రకారం గూడ్స్ వాహనాలు కేవలం సరుకుల రవాణా కోసమే ఉపయోగించాలి వాటిలో వ్యక్తులను, కూలీలను, చిన్నపిల్లలను రవాణా చేయడం నేరమని తెలిపారు. గూడ్స్ వాహనాల్లో ప్రయాణించడం వల్ల తీవ్ర ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువ ఉంటాయని తెలిపారు. వాహనదారులు, డ్రైవర్లు గూడ్స్ వాహనాల్లో వ్యక్తులను తీసుకెళ్లినట్లు గుర్తించిన పక్షంలో సంబంధిత వాహనం పై చర్యలు తీసుకొని వానాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ప్రాణాలను ముప్పుగా మారే ఈ విధానాన్ని ఎట్టి పరిస్థితుల్లో అనుసరించరాదని కోరారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు గౌరవించి సురక్షిత రవాణా కోసం బస్సులు, ఆటోలు, టాక్సీల వంటివి వాడాలి అని మీ ప్రాణాలు మీ చేతిలో ఉన్నాయి అని గుర్తుంచుకొని ప్రయాణం చేయాలని ఎస్సై తెలిపారు.

# కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వందే మాతరం జాతీయ గీతం- డాక్టర్ సాకేత్,డాక్టర్ సిద్ధార్థ



**కొడంగల్ మున్సిపాలిటీ(మం)నవంబర్,07(సమయం న్యూస్) :** వందేమాతరం గీతం ఆలాపన జరిగి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిలో తమ ఆసుపత్రి సిబ్బంది తో కలిసి గీతాలాపనచేసిన వైద్యాధికారులు డాక్టర్ సాకేత్,డాక్టర్ సిద్ధార్థ,మరియు ఆసుపత్రి సిబ్బంది

# తహసీల్దార్ కార్యాలయంలో సామూహిక 'వందేమాతరం' గీతాలాపన



**పరిగి మున్సిపల్ (మం) నవంబర్ 07 (సమయం న్యూస్) :** మహాకవి బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించిన 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక వందేమాతరం గీతాలాపనకు ప్రభుత్వ ఆదేశాలు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జిల్లా పరిగి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు తహసీల్దార్ వెంకటేశ్వరి ఆద్వర్యంలో కార్యాలయ సిబ్బంది సామూహిక 'వందేమాతరం' గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తోపాటు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వందేమాతరం గీతం అలాపన

- డాక్టర్ అమూల్య ప్రియదర్శిని



**వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం,నవంబర్,07(సమయం న్యూస్) :** వందేమాతరం గీతం ఆలాపన జరిగి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భముగా కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి అమూల్య ప్రియదర్శిని తమ సిబ్బంది తో కలిసి గీతాలాపన చేయడం జరిగింది.సుపర్ వేజర్ రఫీ,మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన రామ రాజేష్ ఖన్నాలిఎన్ఆర్ హెచ్ ఎం రాష్ట్ర నాయకులు



**వరంగల్ నవంబర్ 7. (సమయం న్యూస్) :** వరంగల్ జిల్లా శివనగర్ లోని కె.పి.ఎస్. ఏ.సీ. ఫంక్షన్ హాల్ శుక్రవారం రోజున వలుపదాసు రాజన్న-లావణ్య దంపతుల రెండవ సుపుత్రుడు వలపదాసు అక్షిత్ -అలేఖ్య వివాహ వేడుకలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి అక్షింతలు వేసిన జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా , అలాగే రామ సాధన , రామ ధనవర్షిని మరియు వలపదాసు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లప్పుడు మీ ముందుకు న్యాయ సేవలు

### సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్.

**కరీంనగర్ నవంబర్ 07( సమయం న్యూస్). :** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ మరియు సీనియర్ సివిల్ జడ్జి కే వెంకటేష్ గారి ఆధ్వర్యంలో కొత్తపల్లి (హ) లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాజ్యాంగము కల్పించిన హక్కులు మరియు వారి భద్రత కోసం కల్పించిన చట్టాల గురించి వివరించారు, జాతీయ న్యాయ సేవల టోల్ ఫ్రీ నెంబర్ 15100, మాదక ద్రవ్యాల నిరోధక, మరియు సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్స్ తప్పకుండా గుర్తుంచుకోవాలని తెలియజేశారు ఈ సందర్భంగా బాలికలు అన్ని పరిస్థితులలో ధైర్యంగా ఉండాలని ఏదైనా సమస్య తలెత్తితే తల్లిదండ్రులకు గాని ఉపాధ్యాయులకు గాని లేదా న్యాయ సేవా అధికార సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ కి గాని తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అని,చెడు కోసము మొబైల్ వాడడం వలన ఎదుర్కోవలసిన దుష్పరిణామాలను వివరించారు, ఈ కార్యక్రమంలో లో న్యాయమూర్తితో పాటు లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నం రమేష్ ఉపాధ్యాయుని మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు




# రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

### ● ధాన్యం బస్తాల అన్ లోడింగ్ లో జాప్యంపై ఆగ్రహం

**నిజామాబాద్, నవంబర్ 07( సమయం న్యూస్,) :** జిల్లా కేంద్రానికి సమీపంలో ఖానాపూర్ శివారులో కొనసాగుతున్న ఆర్.కె రైస్ మిల్ ను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుండి ఎన్ని లారీల లోడ్ల ధాన్యం పంపించారు, వాటిని ఎప్పుడు దిగుమతి చేసుకున్నారు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలన జరిపారు. అంతకుముందు కలెక్టర్ డిచ్పల్లి మండలం రాంపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఇప్పటివరకు ఎంతమంది రైతుల నుండి ధాన్యం సేకరించారు, రైస్ మిల్లులకు ఎన్ని లారీల లోడ్ల ధాన్యం వెళ్ళింది అని కేంద్రం నిర్వాహకులను ప్రశ్నించారు. అయితే, దొడ్డు రకం ధాన్యాన్ని రైస్ మిల్లుల వద్ద రోజుల తరబడి దించుకోవడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని కేంద్రం నిర్వాహకులతో పాటు స్థానిక రైతులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ కు ఫోన్ చేసి, కొనుగోలు కేంద్రాలకు సరిపడా లారీలను పంపాలని, లేని పక్షంలో కాంట్రాక్ట్ రద్దు చేస్తామని అన్నారు. అక్కడి నుండి కలెక్టర్ నేరుగా ఖానాపూర్ లోని ఆర్.కె రైస్ మిల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రక్ షీట్లను తెప్పించుకుని ధాన్యం అన్ లోడింగ్ సకాలంలో చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. పలు లారీలు రైస్ మిల్ ఆవరణలో ధాన్యం బస్తాల లోడ్లతో నిలిచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్, ఎన్ని రోజుల నుండి ధాన్యం దిగు మతి చేసుకోవడం లేదని లారీ డ్రైవర్ లను ప్ర శ్నించారు. ఐదారు రోజులుగా దించుకోవడం లేదని వారు తెలుపగా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకుని, వెంటవెంటనే ట్రక్ షీట్ లు అం దించాలని పదేపదే సూచిస్తున్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని రైస్ మిల్ నిర్వాహకులను నిలదీశారు. రోజుల తరబడి ధాన్యం దిగుమతి చేసుకో కుండా మిల్లుల వద్దే వాహనాలను నిలిపి ఉంచితే కొను గోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంద ని అన్నారు. ధాన్యం నిల్వలను సకాలంలో దించుకోక పోతే అకాల వర్షాల వల్ల తడిసిపోయే ప్రమా దం ఉంటుందన్నారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ లకు సంబంధించి సమగ్ర పరిశీలన చేసి, తనకు పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ తన వెంట ఉన్న డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీ.ఎం శ్రీకా ంత్ రెడ్డిలకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిల్వలను దిగుమతి చేసుకునే విష యంలో నిర్లక్ష్యానికి తావులేకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని అన్నారు.



# క్యాన్సర్ పై విజయం -స్క్రీనింగ్ తోనే సాధ్యం

### ● జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ రవి రాథోడ్

**మహబూబాబాద్, నవంబర్.7( సమయం న్యూస్).:** ఈ రోజు జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకొని సమాజం లో జీవన ప్రమాణాలు పెరగడం జీవన శైలి లో మార్పులు రావడం తో అసంక్రమిత వ్యాధులు- దీర్ఘ కాలిక వ్యాధులు)- పెరుగుతున్నాయని బి. పి., షుగర్ లతో పాటు ఈ రోజుల్లో క్యాన్సర్ కేసులు కూడా గణనీయం గా నమోదు అవుతున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ రవి రాథోడ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు.మారుతున్న ఆధునిక జీవనశైలి, ఆహారపు అలవాట్లు, మత్తు పదార్థాల వినియోగం, వంశపారంపర్య కారణాలవల్ల ప్రతి సంవత్సరం చాలా ఎక్కువ సంఖ్యలో కొత్త క్యాన్సర్ కేసులు గుర్తింప బడుతున్నాయని, ఆవేదన వ్యక్తం చేస్తూ వీటిలో చాలా కేసులు ఆలస్యం గా గుర్తించబడటం తో రేడియో , కీమో చికిత్సలు తీసుకోవలసిన అవసరం రావడం, తిరిగి నయం చేయలేని స్థితి లో వుండటంతో అధిక మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. కుటుంబాలు ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి ని ఎదుర్కొంటున్నాయని, బి. పి., షుగర్ పరీక్షలు ఎంత ముఖ్యమనే భావనలో వున్నారో, అదే విధంగా క్యాన్సర్ పై అవగాహన పెంచుకోవడం లో వుండాలన్నారు.

దీనికి ఒకే ఒక పరిష్కారం -"ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం మరియు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం" క్యాన్సర్ అంటే భయపడాల్సిన పని లేదని ముందుగానే గుర్తిస్తే కాన్సర్ను నయం చేసే ఆధునిక వైద్య పద్దతులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వం 18 సంవత్సరాల పైబడిన వారందరికి ఉచితం గా నోటి, రొమ్ము మరియు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోందని మీ ఇంటి వద్దకు వస్తున్న ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని, మీ సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఈ పరీక్ష లు ఉచితం గా చేయబడునన్నారు. మీ వ్యక్తిగత వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఏమైనా అనుమానాస్పద లక్షణాలు వుంటే వాటిని వెంటనే మెడికల్ కాలేజీ ఆసుపత్రులలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్స్ కి రిఫర్ చేసి తక్షణమే ప్రత్యేక ఉచిత వైద్య సదుపాయం, అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.

☞ ఇది కొందరికే వస్తుంది, నాకు రాదు అనే అపోహలు వదిలేయండి.

☞ జిల్లా ప్రజలందరూ ముందుకు వచ్చి ఈ పరీక్షలు చేయించుకోండి.

☞ లిముఖ్యంగా మహిళలు మొహమాటం, బిడియం తో వెనుకంజ వేయకుండా ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు..



**వరంగల్ నవంబర్ 7. (సమయం న్యూస్) :** పర్వతగిరి మండల కేంద్రం లోని జె ఆర్ ఆర్ గార్డెన్ లో జంగ శారద - కుమారస్వామి ల కూతురు మహాలక్ష్మి - రాకేష్ ల వివాహనికి హాజరై ఆశీర్వదించిన మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు జంగ శ్రీశైలం, జంగ వీరమల్లు, అక్కల రాజు, బోల్లోజు హర్షవర్ధన్, గిరగాని కుమార్, అనుదీప్, నవీన్, భరత్, సృజనావన్, కృష్ణ చైతన్య, సునీల్, నరేష్, వంశీ, ప్రశాంత్, మహేష్, వీరేందర్, శివాజి, ఉన్నారు

# మాగంటి సునీత గోపినాథ్ గెలుపే లక్ష్యంగా మసీదుల దగ్గర ప్రచారంలో పాల్గొన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి.



**రెహమత్ నగర్,నవంబర్,07(సమయం న్యూస్) :** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రేహమాత్ నగర్ డివిజన్ పరిధిలోని 193,194,195 బూత్ మసీదుల దగ్గర ప్రచారం నిర్వహించి జూబ్లీ హిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ (బీఆర్ఎస్ )కారు గుర్తుపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు కొడంగల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు

# రాంపూర్ లో జ్యోతిబాపూలే పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**నిజామాబాద్, నవంబర్ 07( సమయం న్యూస్). :** డిచ్పల్లి మండలం రాంపూర్ గ్రామంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన సన్నబియ్యం, కోడి గుడ్లు, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఆహార పదార్థాలను భద్రపరిచే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేసేలా చూడాలన్నారు. భోజనం వండడానికి ముందే ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించాలని, కాలం చెల్లిన పదార్థాలు వినియోగించకూడదని సూచించారు. నాసిరకమైన బియ్యం, నూనె, ఇతర సరుకులు సరఫరా జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తేవాలని, వాటి స్థానంలో నాణ్యమైన సరుకులను సమకూర్చేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. నిర్లక్ష్యానికి తావివ్వకుండా, మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసిల్దార్ సతీష్, పాఠశాల ప్రిన్సిపాల్ నరేందర్, స్థానిక అధికారులు ఉన్నారు.

# కలెక్టర్ కార్యాలయం లో "వందేమాతరం" సామూహిక గీతాలాపన



**మహబూబ్ నగర్, నవంబర్ 07 : ( సమయం న్యూస్) :** "వందే మాతరం" జాతీయ గీతాన్ని మహాకవి శ్రీ బంకిమ్ చంద్ర ఛటర్జీ రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) లో వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపించారు. కలెక్టర్ విజయేందిర బోయి ఆధ్వర్యంలో అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది అందరూ స్వచ్ఛందంగా పాల్గొని దేశభక్తి భావాన్ని చాటారు. వందేమాతరం గేయం ప్రతి పౌరుడిలో దేశభక్తి భావాన్ని పెంపొందిస్తుందని, దేశ చరిత్రలో ఈ గేయం విశేష ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. సామూహిక గీతాలాపనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ కలెక్టరేట్ సువర్ణ రాజ్,అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం కేటాయించిన భూమి ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి.

## జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి



**మహబూబ్ నగర్ నవంబర్ 07( సమయం న్యూస్).:** .శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,వివిధ శాఖల అధికారులతో కలిసి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో లక్ష్మి నగర్ లో సర్వే నెంబర్ 247,250 లలో ఎస్.సి.కార్పొరేషన్ కు కేటాయించిన 5 ఎకరాల 30 గుంటల భూమి ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఎస్. సి.కార్పొరేషన్ నుండి హాస్టల్ నిర్మాణం కు ఎస్.సి.అభివృద్ధి శాఖ కు భూమిని అప్పగించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలో విజిలెన్స్ మానిటరింగ్ పి. ఓ. ఏ చట్టం సమావేశం లో కమిటీ సభ్యులు ఎస్. సి కార్పొరేషన్ కు కేటాయించిన భూమి ఆక్రమణలకు గురి అయిందని,ఆక్రమణ లు తొలగించి భూ రక్షణకు చర్యలు తీసుకోవాలని ప్రస్తావించారు.జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,ఆర్.డి. ఓ నవీన్,అర్బన్ తహశీల్దార్ ఘన్సీరాం ,ఎస్.సి.కార్పొరేషన్ ఇంచార్జి ఈ డి వెంకట రెడ్డి,షెడ్యూల్డ్ కులాల అబివృద్ధి అధికారిణి సునీత,మున్సిపల్,సర్వే లాండ్ రికార్డ్,రెవెన్యూ సిబ్బంది తో కలిసి క్షేత్ర పరిశీలన చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ సర్వే లాండ్ రికార్డ్ అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని,భూమి రక్షణకు సంబంధిత షెడ్యూల్డ్ కులాల శాఖ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని,ఆక్రమణలు పై పరిశీలించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు

# పాఠశాలలను రెగ్యులర్‌గా తనిఖీ చేయాలి.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- నవంబర్ 10 వరకు శిథిలావస్థలో ఉన్న భవనాల వివరాలు అందించాలి
- ప్రతిరోజు గంట నుంచి రెండు గంటల సమయం విద్యార్థులకు రీడింగ్ స్కిల్స్ పెంపు పై దృష్టి
- పాఠశాలలో ఇంటర్నెట్ సౌకర్యం ఉండేలా చూడాలి
- 5% పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఫుడ్ ఇన్స్ పెక్టర్ లచే ఆకస్మిక తనిఖీ
- విద్యా శాఖ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, నవంబర్-07:( సమయం న్యూస్) :** ప్రతి మండలంలోని మండల విద్యాశాఖ అధికారి తన పరిధిలోని పాఠశాలలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీ తో కలిసి విద్యా శాఖ పై సంబంధిత అధికారుల తో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ విద్యాశాఖ సంబం ధించి జిల్లాలో చేపట్టిన వివిధ కార్యక్రమాల పురోగతి వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయకపోవడం వల్ల పెద్దపల్లి జిల్లా వెనుకబడి ఉందని కలెక్టర్ తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు రెగ్యులర్ గా పాఠశాలలను ఫీల్డ్ విజిట్ చేస్తూ సదరు వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పెద్దపల్లి, ధర్మారం, పాలకుర్తి మండలాల ఎం.ఈ.ఓ లు మినహా యించి ఎవరు వారి మండల పరిధిలో 100% పాఠశాల తనిఖీలు చేపట్టలేదని కలెక్టర్ తెలిపారు. ఎం.ఈ.ఓ, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ వారి పరిధిలో ఉన్న పాఠశాలలను రెగ్యులర్ తనిఖీ చేస్తూ మెరుగైన విద్యాబోధన అందాల చూడాలని అన్నారు. పాఠశాలల తనీఖీ ఉన్నతాధికారులు వీక్లీ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. తరగతి గదిలో ప్రతి రోజు గంట నుంచి రెండు గంటల వరకు పిల్లల రీడింగ్ స్కిల్స్, గ్రహణ శక్తి పెంచే విధంగా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల పరిధిలో శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల వివరాలు నవంబర్ 10 వరకు అందించాలని , ప్రభుత్వ పాఠశాలలో పాత సామాగ్రి, బీరువాలు, కుర్చీలు ,ఫ్యాన్లు విరిగిపోయిన బెంచీలు, స్క్రాప్ పూర్తి స్థాయిలో తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని పాఠశాలల సమీపంలో పిచ్చి మొక్కలు, కంప చెట్లు ఎక్కడైనా ఉంటే వెంటనే పంచాయతీ కార్యదర్శి తో సమన్వయం చేసుకుంటూ తొలగించాలని అన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యుత్, ఇంటర్నెట్ కనెక్షన్ అందించేందుకు చర్యలు చేపట్టామని దీనికి పాఠశాల సిబ్బంది సహకారం అందించాలని అన్నారు. యూ.ఐ.డి.సి లో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి సంపూర్ణ సమాచారం ఎప్పటికప్పుడు అప్ డేట్ చేయాలని అన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు గ్యాస్ కనెక్షన్ అందించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం భోజనం సంబంధించి వంట చేసేవారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించడంలో నాణ్యత పాటించాలని, 5 శాతం ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఇన్స్ పెక్టర్ ల ద్వారా ఆకస్మికంగా తనకి నిర్వహించి నాణ్యతను చెక్ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఉన్న ఆదర్శ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, ప్రతి నెల 10వ తారీఖు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సమక్షంలో సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.ఎఫ్.ఆర్.ఎస్ అటెండెన్స్ పక్కాగా నమోదు చేయాలని, ఉపాధ్యాయుల 95%, స్టూడెంట్ 85% హాజరు తప్పకుండా ఉండాలని అన్నారు. ఉపాధ్యాయుల సెలవులు ఆన్ లైన్ లో నమోదు అయ్యేలా హెడ్ మాస్టర్ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, మండల విద్యాధికారులు , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు , సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా లో లాంచనంగా ప్రారంభం అయిన చేప పిల్లల విడుదల కార్యక్రమం

- ఘనపూర్, గండి రామారం రిజర్వాయర్‌లో
- చేప పిల్లలను వదిలిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి,
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ఘనపూర్ నవంబర్ 07( సమయం న్యూస్).**జిల్లా లో ఉచిత చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని శుక్రవారంఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారుఘనపూర్, గండి రామరామ్ రిజర్వాయర్ లో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా... ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తూ మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతోందన్నారుఈ రిజర్వాయర్ ద్వారా ఏటా సుమారు నాలుగు వందల టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతుందని... దాదాపు నాలుగు కోట్ల రూపాయల విలువైన చేపలు మార్కెట్లోకి వస్తున్నాయి అని తెలిపారు.

మత్స్యకారుల ఆదాయం పెరగడం కోసం చేపలను పెంచడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు, రవాణా సౌకర్యాలు కల్పించేలా అధికారులను సూచించినట్టు తెలిపారు.ప్రస్తుతం ఘనపూర్ రిజర్వాయర్ పరిధిలో 319 మహిళా సంఘాల సభ్యులు, 700 మంది మత్స్యకార సంఘ సభ్యులు, మరో 300 మంది సభ్యత్వం కోసం అప్లై చేసుకున్నారని మొత్తం 1300 మంది మత్స్యకారులు నెలకు పదివేల రూపాయలకు పైగా సంపాదించే స్థాయికి చేరుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ మాట్లాడుతూ... జిల్లా లోని మొత్తం 736 చెరువులు, 9 రిజర్వాయర్ లలో 2 కోట్ల 72 లక్షల చేప పిల్లల విడుదల లక్ష్యం కాగా.......ఈరోజు లాంచనం గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని.. మొత్తం ప్రక్రియ ఈ నెల ఆఖరి వరకు పూర్తి అవుద్దన్నారు ఈ చేప పిల్లల విడుదల వల్ల 190 మత్స్యకారుల సహకార సంఘాల్లోని 19 వేల సభ్యులతో పాటు వీరి మీద ఆధార పడిన దాదాపు 80 వేల మత్స్య కార్మికుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారుఇక్కడ ఉత్పత్తి అయ్యే చేపలను డిమాండ్ ఎక్కువగా ఉండే ఇతర రాష్ట్ర ప్రాంతాలకు కూడా మార్కెటింగ్ చేసి అధిక లాభాలను పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారుఈ కార్యక్రమం లో ఆర్డీ ఓ వెంకన్న, జిల్లా మత్స్య శాఖ అధికారి రానా ప్రతాప్, డీపీవో, తహసీల్దార్ జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యక్షులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# రాజమండ్రి శిక్షణకు 11 సీట్లు అవకాశాన్ని వినియోగించుకోవాలి

## వడ్రంగి/కార్పెంటర్ సంఘ పెద్దలకు సూచన: జిల్లా కలెక్టర్



**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్,07( సమయం న్యూస్) :** కలెక్టరేట్‌లో శుక్రవారం, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, వడ్రంగి (కార్పెంటర్) సంఘ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫర్నిచర్ రంగంలో నైపుణ్యం కలిగిన యువతకు లభిస్తున్న అవకాశాలను వివరించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాజమండ్రిలో ఈ సోమవారం నుండి ప్రారంభమయ్యే రెసిడెన్షియల్ ఫర్నిచర్ అసిస్టెంట్ శిక్షణ కోసం 11 సీట్లు అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. దీనికి సంబంధించి శనివారం (రేపు) ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని %-20 గదిలో ఒరియంటేషన్ మరియు ఎంపిక పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు.శిక్షణకు ఎంపికయ్యే అభ్యర్థులకు: ఒక్కొక్కరికి రూ. 5,000 రిజిస్ట్రేషన్ ఫీజును జిల్లా యంత్రాంగం భరిస్తుందని, వసతి మరియు భోజనం పూర్తిగా ఉచితంగా ఆ సంస్థ ద్వారా కల్పించబడుతుందని తెలిపారు.శిక్షణ పూర్తయ్యిన వెంటనే రూ. 15,000/- స్తాయిలో 6 నెలల అప్రెంటిస్‌షిప్ అవకాశాన్ని కూడా కల్పిస్తారని, అనంతరం 100% ప్లేస్మెంట్ అదే సంస్థలోనే కల్పిస్టారని పేర్కొన్నారు.ఇప్పటికే జిల్లాలో NSTI-FFSC ఆధ్వర్యంలో మొదటి విడతలో 8 మంది శిక్షణ పూర్తి చేసుకుని అప్రెంటిస్‌షిప్‌లో ఉన్నారని, రెండవ విడతలో 19 మంది అభ్యర్థులను గురువారం ఎంపిక చేసినట్లు కలెక్టర్ తెలిపారు.రాజమండ్రి శిక్షణ కోసం ఇంకా 11 మందిని శనివారం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వడ్రంగి/కార్పెంటర్ యువతతో పాటు ఆసక్తి ఉన్న ఇతర యువత కూడా వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# జలమండలిలో సామూహిక వందే మాతరం గీతాలాప.



**హైదరాబాద్ నవంబర్07( సమయం న్యూస్).:** వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జలమండలి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అధికారులు, సిబ్బంది వందేమాతర గీతం ఆలపించారు. ఈ కార్యక్రమానికి జలమండలి పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ప్రాజెక్టు డైరెక్టర్లు సుదర్శన్, శ్రీధర్,ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి హాజరై.. వందే మాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మొబైల్ రికవరీ 'మిషన్ సక్సెస్' రూ. 18 లక్షల ఫోన్లు అప్పగింత!




**సమయం ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆదిలాబాద్ పోలీసులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీలో అద్భుతమైన విజయాన్ని సాధించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక రికవరీ బృందం, కేవలం నెల రోజుల వ్యవధిలో దాదాపు రూ. 18 లక్షల విలువైన 117 మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టింది. వీటిలో చాలా ఫోన్లు ఉత్తర భారతదేశంలో ఉండగా, ప్రత్యేక బృందం చాకచక్యంగా వాటిని తిరిగి సంపాదించింది. ఇప్పటివరకు జిల్లాలో 1150 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేయడం జరిగిందన్నారు. మొబైల్ ఫోన్లు తిరిగి పొందిన మధ్యతరగతి మరియు బీద కుటుంబాలకు చెందిన బాధితులు, ఎస్పీ అఖిల్ మహాజన్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ రికవరీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రతి నెలా పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ప్రజలు సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా లేదా దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే, మొబైల్ దుకాణాల యజమానులు దొంగిలించబడిన ఫోన్లను కొనుగోలు చేయకూడదని, చట్టప్రకారం చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు.



# జూబ్లీహిల్స్ ఖేల్‌మే
# ముస్లిం ఓటు కిదర్?



జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఇప్పుడు అధికార కాంగ్రెస్ నాయకత్వానికి, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు మధ్య జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ప్రజాభిప్రాయ సేకరణ. పోరాటంలో అసలైన 'బాస్' ముస్లిం మైనారిటీలే.. నియోజకవర్గంలో సుమారు లక్ష మందికి పైగా మైనారిటీ ఓటర్లు ఉన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి, రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఈ ఉపఎన్నిక ఒక తీవ్రమైన 'పరీక్ష'గా మారింది. ఒకవేళ కాంగ్రెస్ ఇక్కడ ఓడిపోతే, అది ప్రభుత్వ వైఫల్యానికి 'ధ్రువీకరణ' అవుతుందని, పార్టీలోని అంతర్గత శక్తులు తిరుగుబాటు చేసేందుకు దారి తీస్తుందని ముఖ్యమంత్రి వర్గం ఆందోళన చెందుతోంది. 'నాయక్' కాంగ్రెస్ పట్టు నిలుపుకుంటదా, పాత 'బాద్‌షా' బీఆర్ఎస్‌కు మద్దతిస్తరా, అనేది ఇక్కడ అత్యంత కీలకం.

## ముస్లిం ఓటుపై రెండు పార్టీల ఆశలు!

జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం లో గెలుపోటములను నిర్ణయించే కీలక శక్తి ముస్లిం మైనారిటీ ఓటర్లే. బోరబండ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, షేక్‌పేట, ఎర్రగడ్డ వంటి ప్రాంతాలలో ముస్లిం ఓటర్ల సంఖ్యా బలం గణనీయంగా ఉండడం వల్లనే, నియోజకవర్గం పాతబస్తీ వెలుపల మైనారిటీ ఓటు నిర్ణయాత్మకంగా ఉండే ఏకైక స్థానంగా పరిగణించబడుతుంది. నియోజకవర్గంలోని సుమారు 3.99 లక్షల మంది ఓటర్లలో లక్ష మందికి పైగా మైనారిటీ వర్గానికి చెందిన వారున్నారు. ఈ ఓటర్లు మొత్తం ఓట్లలో దాదాపు 30 శాతం కలిగి ఉండటం విశేషం. మైనారిటీ ఓటర్ల ఏకాభిప్రాయమే అభ్యర్థి గెలుపోటములను ప్రభావితం చేస్తుందని స్పష్టమవుతోంది. అందుకే రెండు పార్టీలు తమ ప్రచారంలో మైనారిటీలను మెప్పించడానికి నానా తంటాలు పడుతున్నాయి.

## సానుభూతి వర్సెస్ యువ ఉత్సాహం..

ఈ పోరాటంలో పోటీపడుతున్న ప్రధాన అభ్యర్థుల బలాబలాల్లో స్పష్టమైన తేడా కనిపిస్తోంది. బీఆర్ఎస్ తరఫున దివంగత ఎమ్మెల్యే సతీమణి మాగంటి సునీత పోటీ చేస్తున్నారు. ఆమెకు ప్రధాన బలం 'సానుభూతి'. ఆమెకు ప్రత్యక్ష రాజకీయ అనుభవం తక్కువ ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ 'పాత పునాది' దివంగత నేత చేసిన పనుల 'ఉపకారం' పై ఆధారపడ్డారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికంగా బలమైన నాయకుడు. ఆయనకు 'యువ ఉత్సాహం' ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుండి నేరుగా మద్దతు లభించింది. స్థానికంగా బీఆర్ఎస్‌కు ఉన్న బలమైన 'కార్యకర్తల బలం' ను, సానుభూతిని అధిగమించడం నవీన్ యాదవ్‌కు చాలా కష్టం.

## మజ్లిస్ మౌనం వెనుక అసలు కథ!




జూబ్లీహిల్స్ ఉపఎన్నికను మజ్లిస్ అధ్యక్షుడు ఒవైసీ 'స్నేహపూర్వక పోరాటం'గా చూస్తున్నప్పటికీ, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎంఐఎం భవిష్యత్తు రాజకీయాల కోసం జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. గతంలో బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చిన ఎంఐఎం, ఇప్పుడు ఎన్నడూ లేని విధంగా తమ శ్రేణులను కాంగ్రెస్ పతాకం పట్టుకొని ప్రచారంలోకి దింపడం ఈ ఎన్నికలో అతిపెద్ద మలుపు. గతంలో కాంగ్రెస్ నాయకులను, అభిమానులను వ్యతిరేకంగా చూసిన ఎంఐఎం నాయకులు ఇప్పుడు ఇంటింటికీ కాంగ్రెస్ పతాకం పట్టుకోవడం కేవలం అవకాశవాద రాజకీయాలతో వ్యక్తిగత ప్రయోజనం పొందాలనే ఉద్దేశంతోనే అని జూబ్లీ హిల్స్ ఓటర్లు అభిప్రాయపడుతున్నారు. ఈ అనూహ్య పరిణామం పట్ల కాంగ్రెస్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, ఈ 'నిర్ణయాత్మక' ఓటు ఎటువైపు పోతుందోనని రెండు ప్రధాన పార్టీలు ఆందోళన చెందుతున్నాయి. ఈ పోరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంతర్గత 'సంఘ-ర్షణ' పరంగా అతిపెద్ద పరీక్షగా మారిందిబీ ఒకవేళ కాంగ్రెస్ ఇక్కడ ఓడిపోతే, రేవంత్ రెడ్డి 'తగ్గాలని' కోరుకుంటున్న కాంగ్రెస్ మంత్రుల్లో కొంతమంది తిరుగుబాటుకు దారి తీస్తారనే ఆందోళన ముఖ్యమంత్రి వర్గంలో బలంగా ఉంది.



## ప్రచారాస్త్రాలు..

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల 'ఇళ్లు' కూల్చివేస్తోందంటూ 'బుల్డోజర్' రాజకీయాలను ప్రధాన అస్త్రంగా వాడుతున్నారు. ఇది పేదలకు 'మోసం' అని ప్రచారం చేస్తున్నారు. ఉపఎన్నికలో ఓటమి ఎదురైతే, ఇప్పటిదాకా మౌనంగా ఉన్న మంత్రులు, శాసనసభ్యులు రేవంత్ రెడ్డి పరిపాలనపై బహిరంగంగా మాట్లాడే అవకాశం ఉంది. అందుకే ఎన్నికల నియమావళిని కూడా పట్టించుకోకుండా, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో రోడ్‌షోలు, ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించడం ద్వారా 'గెలుపు లక్ష్యం' పట్ల నిబద్ధతను చాటుకున్నారు.

## ప్రజల 'తీర్పు' దేనిపై?

జూబ్లీహిల్స్ ఫలితం ఏ పార్టీకి అనుకూలంగా వచ్చినా, అది తెలంగాణ రాజకీయాలకు ఒక 'ముఖ్యమైన వార్త' అవుతుంది. నిరుపేదలైన మైనారిటీలకు ప్రభుత్వం ఇచ్చిన 'ఆరు హామీల'కు మొగ్గ చూపొచ్చు. మరోవైపు, 'బుల్డోజర్' భయం, మజ్లిస్ తో ఉన్న పాత పరిచయాలు బీఆర్ఎస్‌కు బలం చేకూర్చవచ్చు. నవంబర్ 11న ఓటరు 'తీర్పు' ఏంటో తేలిపోతుంది. జూబ్లీహిల్స్ పోరాటంలో అసలు 'నిర్ణేత' ఎవరో తెలుస్తుంది. ఓటమి ఎదురైతే, రేవంత్ రెడ్డికి తన పాలనను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందని కొందరు భావిస్తున్నా, అంతర్గత కలహాలు తీవ్రమవుతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464



# ఆర్థిక పాలనలో పట్టు తప్పిందా!?

**సమయం ప్రత్యేక ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం అధికారికంగానే ప్రమాదంలో ఉంది. ఇది కేవలం ఆర్థిక సంక్షోభం మాత్రమే కాదు, పాలనా వైఫల్యం మరియు నిధుల నిర్వహణా లోపానికి సూచన. రాష్ట్రంపై అప్పుల భారం బుల్డోజర్ లా దూసుకుపోతుంటే, పాలకపక్షం పాత పాలనపై 'రాజకీయ విమర్శలకే' పరిమితమైంది. 2026 మార్చి నాటికి రాష్ట్రంపై ఏకంగా ₹5,04,814 కోట్ల భయంకరమైన రుణభారం ఉంటుందని బడ్జెట్ అంచనాలు చెబుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రధాన కారణాలలో అనవసర వ్యయం, ఆర్భాటాలపై ఉన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యమంత్రి విమాన ప్రయాణాలు, అనావశ్యక ఖర్చులతో నిధులు వృథా అవుతున్నాయనే విమర్శ బలంగా ఉంది.

### బకాయిల మోత, ఆదాయానికి గండం..

ప్రస్తుత ఆర్థిక చిక్కులకు నిదర్శనంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి. వృత్తి విద్యా కళాశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం ₹10,000 కోట్లకు పైగా చేరింది. దసరా సందర్భంగా ₹1,200 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చినా, కేవలం ₹300 కోట్లు మాత్రమే విడుదల చేసింది. దీంతో ఆగ్రహించిన ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య నవంబరులో నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చింది. అదే సమయంలో, ప్రభుత్వం ప్రధానంగా ఆధారపడిన మత్తు పానీయాల తయారీ సంస్థలకు దాదాపు ₹3,366 కోట్ల రూపాయల వరకు బకాయిలు పేరుకుపోవడంతో, వారు డిసెంబరు నుంచి సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ రెండు అంశాలు ఆర్థిక నిర్వహణా లోపాన్ని, నిధుల ప్రాధాన్యత లేమిని సూచిస్తున్నాయి.

### సిగాచి దుర్ఘటనపై కోర్టు వ్యాఖ్యలు!

నష్టపరిహారం విషయంలో హామీని నిలబెట్టుకోకపోవడంపై పాలకవర్గానికి న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని సిగాచి రసాయన కర్మాగారంలో జూన్ 30, 2023న జరిగిన ప్రమాదంలో చనిపోయిన 46 మంది కార్మికులకు కోటి రూపాయల పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా, కేవలం ₹25 లక్షలు మాత్రమే చెల్లించడంపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. మనుషుల మరణాల విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పడం ఏమిటని న్యాయస్థానం సూటిగా ప్రశ్నించడం, ప్రభుత్వానికి న్యాయపరమైన ఇబ్బందులను పెంచింది.

### మానవీయ నిర్లక్ష్యం?

రాష్ట్రంలోని మరో దుర్ఘటన - శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్-ఎల్‌బిసి) పనులు. ఇక్కడ ఫిబ్రవరి 21, 2024న జరిగిన ప్రమాదంలో 8 మంది కార్మికులు మృతి చెందగా, వారిలో ఇద్దరి మృతదేహాలను మాత్రమే బయటకు తీయగలిగారు. మిగిలిన 6 మృతదేహాలకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి సమాచారం వారి కుటుంబాలకు తెలియదు. ప్రమాదం జరిగి చాలా కాలం అవుతున్నా, మృతదేహాలను బయటకు తీయడంలో ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరించలేదనే విమర్శ ఉంది. ఇటువంటి మానవీయ సమస్యల పట్ల కూడా ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం, సామాన్య ప్రజానీకంలో తీవ్ర అసంతృప్తిని పెంచుతోంది.

### నిధుల లోపం - అభివృద్ధి స్తంభన..

పాలకులు హామీలు ఇవ్వడం వరకే పరిమితమై, కొత్త అభివృద్ధి పనులను చేపట్టడం లేదు. ఒక వైపు ప్రతి నెలా అప్పులు చేస్తూ, భూములను సైతం విక్రమిస్తూ ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. చేతికి నిధులు వస్తున్నా, వాటిని ఎక్కడ ఖర్చు చేస్తున్నారో, ప్రాధాన్యత ఏంటో పాలక వర్గానికి సరిగా తెలియకపోవడమే ఈ సంక్షోభానికి ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. పీఆర్‌సీ అమలు చేయకపోవడం, చిన్న కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించకపోవడం వలన ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టర్లలో కూడా తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది.

### సంక్షోభం నుంచి గట్టెక్కే పరిష్కారాలు..

రాష్ట్రం ఎదుర్కొంటున్న రూ. 5,04,814 కోట్ల భారీ అప్పుల భారం నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వం తక్షణమే ఖర్చుల క్రమబద్ధీకరణ ప్రక్రియను చేపట్టాలిబీ అనవసర ఖర్చులను మరియు భూముల విక్రయాన్ని వెంటనే ఆపివేయాలి. ప్రాథమికంగా, విద్యా సంస్థలకు, మద్యం సరఫరాదారులకు (₹3,366 కోట్లు), చిన్న కాంట్రాక్టర్లకు ఉన్న బకాయిలను చెల్లించడానికి 'ప్రత్యేక విముక్తి నిధి'ని ఏర్పాటు చేసి, నిధులను అత్యవసరంగా విడుదల చేయాలి. అదే సమయంలో, ప్రమాద బాధితులకు ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పూర్తి పరిహారం అందించాలి. దీర్ఘకాలికంగా, పన్నుల సంస్కరణలు, పరిశ్రమల ప్రోత్సాహం ద్వారా రాష్ట్ర సొంత ఆదాయ వనరులను పెంచి, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి. చివరిగా, ఆర్థిక పరిస్థితిపై 'శ్వేతపత్రాన్ని' విడుదల చేసి, పారదర్శకతను పెంచాలి.



# శుభ్‌మన్ గిల్‌పై వేటు పడేనా?

**ఆస్ట్రేలియాతో ఆఖరి పోరుకు భారత్ సిద్ధం**

**బ్రిస్బేన్ వేదికగా ఆస్ట్రేలియాతో నాలుగో టీ20**

**సంజూను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్**

**ఐదు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యం**




ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు ఆఖరి పోరుకు సిద్ధమైంది. శనివారం బ్రిస్బేన్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఆతిథ్య ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. నాలుగో టీ20లో అద్భుత విజయాన్ని అందుకున్న టీమిండియా ఆఖరి మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగించి సిరీస్ కైవసం చేసుకోవాలనుకుంటుంది. మ-రోవైపు యాషెస్ సిరీస్ నేపథ్యంలో సీనియర్లు దూరమైన వేళ యువ ప్లేయర్లతో ఆడుతున్న ఆసీస్.. సిరీస్ సమం చేయడంపై కన్నేసింది. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహకంలో భాగంగా ఆఖరి మ్యాచ్‌లోనూ మార్పులు చేసే అవకాశం ఉంది. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డితో పాటు సంజూ శాంసన్‌ను తుది జట్టులోకి తీసుకునే ఛాన్స్ ఉంది. ఈ ఇద్దరి కోసం వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు శివమ్ దూబేకు విశ్రాంతి ఇవ్వవచ్చు.టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్‌ను టీమిండియా ప్రయోగాలకు ఉపయోగించుకుంది. హర్షిత్ రాణా, సంజూ శాంసన్, కుల్దీప్ యాదవ్‌లను తొలి రెండు టీ20ల్లో ఆడించగా.. జట్టు అంచనాలను అందుకోలేకపోయారు. దాంతో మూడో టీ20లో ఈ ముగ్గురిపై వేటు వేసిన గంభీర్.. జితేశ్ శర్మ, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్‌లకు అవకాశాలు కల్పించింది. ఈ ముగ్గురు అద్భుతమైన ప్రదర్శన కనబర్చారు. నాలుగో టీ20లో జితేశ్, సుందర్ విఫలమైనా.. ఆఖరి మ్యాచ్‌లో కొనసాగించనున్నారు. రెండు మినహా తుది జట్టులో భారీగా మార్పులు జరిగే అవకాశం లేదు. బ్యాటింగ్‌లో సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ సత్తా చాటాల్సి ఉంది.



ముఖ్యంగా సూర్య వైఫల్యం విమర్శలకు దారి తీస్తోంది. బౌలింగ్ బాధ్యతలను జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లతో పాటు స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తీ,వాషింగ్టన్ సుందర్‌లు పంచుకోనున్నారు. నితీష్ కుమార్ రెడ్డి కూడా అండగా నిలవనున్నాడు.

**ఆస్ట్రేలియాతో నాలుగో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)**

శుభ్‌మన్ గిల్/సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే/నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, జితేష్ శర్మ(కీపర్), అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తీ.



# ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం!

టీమిండియా మాజీ చీఫ్ సెలెక్టర్, తెలుగు తేజం ఎమ్మెస్కే ప్రసాద్‌కు ఘోర అవమానం ఎదురైంది. ప్రపంచకప్ విన్నర్, తెలుగు తేజం శ్రీచరణికి ఘన స్వాగతం పలికేందుకు గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఎమ్మెస్కే ప్రసాద్‌ను సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకుంది. ఈ వ్యవహారంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఎమ్మెస్కే ప్రసాద్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్‌గా తనకు ప్రోటోకాల్ ఇవ్వకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెస్కే ప్రసాద్.. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ప్రతినిధులపై కూడా బీసీసీఐకి ఫిర్యాదు చేసే యోచనలో ఉన్నారు.ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఎమ్మెస్కే ప్రసాద్ అద్భుత పనితీరు కనబర్చాడు. 2009 నుంచి 2014 వరకు ఈ బాధ్యతలు నిర్వర్తించిన ఎమ్మెస్కే ప్రసాద్.. క్రికెటర్లకు అనేక మౌళిక వసతులు కల్పించాడు. ఏసీ క్రికెట్ అకాడమీలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఏసీఏ మైదానాల అభివృద్ధికి కృషి చేశారు. ఈ పని తీరుకు రివార్డ్‌గానే అతనికి చీఫ్ సెలెక్టర్ పదవి దక్కింది. అలాంటి ఆటగాడిని సెక్యూరిటీ అడ్డుకోవడంపై క్రికెట్ అభిమానులు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వికెట్ కీపర్ కమ్ బ్యాటర్ అయిన ఎమ్మెస్కే ప్రసాద్.. 1999-2000 మధ్య భారత్ తరపున ఆరు టెస్టు మ్యాచ్‌లు మరియు 17 వన్డేలు ఆడాడు. 2016 నుంచి 2019 వరకు భారత చీఫ్ సెలెక్టర్‌గా పని చేశారు.

## ప్రతీకా రావల్‌కు దక్కనున్న గౌరవం



మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో భారత ఓపెనర్ ప్రతీకా రావల్ అద్భుతంగా రాణించింది. అయితే సెమీఫైనల్‌కు ముందు బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో గాయపడిన ప్రతీక జట్టుకు దూరమైంది. ఆమె స్థానంలో షెఫాలీ వర్మ జట్టులోకి వచ్చింది. దీంతో ఫైనల్ మ్యాచ్ అనంతరం ప్రతీకకు వరల్డ్‌కప్ విన్నర్ మెడల్ ఇవ్వలేదు. . ఫైనల్ మ్యాచ్ దాకా జట్టులో ఉన్నవాళ్లకే మెడల్ అందిస్తారు. ఈ కారణంగానే ప్రతీకకు మెడల్ అందలేదు. దీంతో నెటిజన్లు అసంతృప్తి చెందారు. టోర్నీ ఆసాంతం ఆడిన ప్లేయర్‌కు మెడల్ ఇస్తే బాగుండేది అన్న వాదనలు వినిపించాయి. అయితే తనకు కూడా ఐసీసీ వరల్డ్‌కప్ విన్నర్ మెడల్ రానున్నట్లు ప్రతీక తాజాగా ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించింది. ఐసీసీ ఛైర్మన్ జైషా చొరవతో తనకు మెడల్ లభించనున్నట్లు చెప్పింది. అలాగే ఇటీవల ప్రధాని మోదీతో మీటింగ్‌లో తాను మెడల్ ధరించి కనిపించింది. దీంతో ఆమెకు మెడల్ వచ్చేసిందేమో అని అంతా అనుకున్నారు. కొంతమంది మాత్రం అది టీమ్‌మేట్ అమన్‌జోత్ కౌర్ మెడల్ అని పోస్టులు షేర్ చేశారు. కానీ, ఈ మెడల్ సపోర్టింగ్ స్టాఫ్ మెంబర్‌ది అని ప్రతీక తాజా ఇంటర్వ్యూలో పేర్కొంది. 'ఈ విషయంలో ఛైర్మన్ జై షా చొరవ తీసుకున్నారు. నాకు మెడల్ తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మా మేనేజర్‌కు మెసేజ్ పంపారు. అలా ఎట్టకేలకు నేను నా మెడల్‌ను పొందబోతున్నాను. ప్రస్తుతం సపోర్టింగ్ స్టాఫ్ మెడల్ ఇచ్చారు. ఈ మెడల్‌ను తొలిసారి చూడగానే ఎమోషనల్ అయిపోయా, కళ్లలో నీళ్లు తిరిగాయి. నా మెడల్ రావడానికి కొంచెం టైమ్ పట్టొచ్చు. త్వరలోనే నేను దాన్ని అందుకుంటాను' అని ప్రతీకా రావల్ వెల్లడించింది.కాగా, ఈ టోర్నమెంట్‌లో ప్రతీకా రావల్, స్మృతి మంధానతో కలిసి ఓపెనర్‌గా ఆడింది. ఆమె 6 ఇన్నింగ్స్‌లలోనే 1 సెంచరీ, 1 హాఫ్ సెంచరీ సహా 308 పరుగులు చేసింది. మొత్తం 37 ఫోర్లు, 4 సిక్సర్లు కొట్టింది. ఆమె అత్యధిక స్కోరు 122. దీంతో టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో బ్యాటర్‌గా నిలిచింది. ఇక భారత్‌లో స్మృతి తర్వాత ఎక్కువ పరుగులు బాదింది ప్రతీకనే. అయితే బంగ్లాదేశ్‌తో లీగ్ చివరి మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా మోకాలికి తీవ్ర గాయమైంది. దీంతో ఆమె జట్టుకు దూరమైంది. అయినా ఫైనల్ మ్యాచ్‌కు ప్రతీక స్టేడియానికి వచ్చింది. డగౌట్ నుంచే టీమ్‌ఇండియా ప్లేయర్లను ప్రొత్సహించింది.రీసెంట్‌గా ఢిల్లీలో మోదీను కలిసిన టీమ్‌ఇండియా జట్టులో ప్రతీక కూడా ఉంది. నడవలేని స్థితిలో ఉన్న ఆమె ప్రధాని దగ్గరకు వీల్ చైర్‌లోనే వెళ్లింది. ఇక స్నాక్స్ టైమ్‌లో ఆమె నడవలేదని గుర్తించిన మోదీ, స్వయంగా ఆమెకు ఫుడ్ అందించారు. ఇది అక్కడున్న వాళ్లందరినీ ఆకట్టుకుంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్

## జస్‌ప్రీత్ బుమ్రాకు అరుదైన ఘనత




టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. టీ20ల్లో ఆస్ట్రేలియాపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. నవంబర్ 6న క్వీన్స్‌లాండ్ వేదికగా ఆసీస్‌తో జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో ఓ వికెట్ పడగొట్టడం ద్వారా బుమ్రా ఈ ఘనత అందుకున్నాడు. ఈ క్రమంలో అతడు పాకిస్తాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ను అధిగమించాడు.ఆసీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌ల్లో అజ్మల్ 11 ఇన్నింగ్స్‌ల్లో 19 వికెట్లు తీశాడు. ఇక బుమ్రా 17 ఇన్నింగ్స్‌ల్లో 20 వికెట్లు సాదించాడు. ఈ జాబితాలో వీరిద్దరి తరువాతి స్థానాల్లో పాక్ ఆటగాడు మహ్మద్ అమీర్, న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ సాంట్నర్ ఉన్నారు.ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో శుభ్‌మన్ గిల్ (46), అభిషేక్ శర్మ (28), శివమ్ దూబె (22), అక్షర్ పటేల్ (21 నాటౌట్) రాణించారు. ఆసీస్ బౌలర్లలో ఆడమ్ జంపా, నాథన్ ఎల్లిస్‌లు చెరో మూడు వికెట్లు తీశారు. జేవియర్ బార్ట్‌లెట్, మార్కస్ స్టోయినిస్ తలా ఓ వికెట్ సాధించారు.అనంతరం 168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ 18.2 ఓవర్లలో 119 పరుగులకు ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మిచెల్ మార్ష్ (30), మాథ్యూ షార్ట్ (25)లు పర్వాలేనిపించగా.. జోష్ ఇంగ్లిష్ (12), టిమ్ డేవిడ్ (14), జోష్ ఫిలిప్ (10), గ్లెన్ మాక్స్‌వెల్ (2)లు విఫలం అయ్యారు. టీమ్‌ఇండియా బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ మూడు వికెట్లు, అక్షర్ పటేల్, శివమ్ దూబెలు చెరో రెండు వికెట్లు తీశారు. వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రాలు తలా ఓ వికెట్ పడగొట్టారు.

**టీ20ల్లో ఆసీస్ పై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు వీరే..**

1. జస్‌ప్రీత్ బుమ్రా (భారత్)- 20 వికెట్లు (17 ఇన్నింగ్స్‌ల్లో)
2. సయీద్ అజ్మల్ (పాకిస్తాన్) - 19 వికెట్లు (11 ఇన్నింగ్స్‌ల్లో)
3. మహ్మద్ అమీర్ (పాకిస్తాన్) - 17 వికెట్లు (10 ఇన్నింగ్స్‌ల్లో)
4. మిచెల్ సాంట్నర్ (న్యూజిలాండ్) - 17 వికెట్లు (12 ఇన్నింగ్స్‌ల్లో )



## చరిత్ర సృష్టించిన ఆర్చర్ శీతల్ దేవీ

ఒలింపిక్ మెడల్ విన్నర్, భారత స్టార్ పారా ఆర్చర్ శీతల్ దేవి కెరీర్‌లో మరో మైలురాయిని సాధించింది. ఇటీవల జాతీయ ట్రయల్స్‌లో అద్భుతమైన ప్రదర్శన తర్వాత, జెడ్డాలో జరగనున్న ఆసియా కప్ స్టేజ్- 3 పోటీలకు శీతల్ ఎంపికైంది. అయితే ఈ పోటీలో ఆమె, శారీరకంగా ఫిట్? గా ఉన్న అథ్లెట్లను ఎదుర్కోనుండడం విశేషం. సౌదీ అరేబియా జెడ్డా వేదికగా వచ్చే నెలలో వివిధ ఈవెంట్లలో స్టేజ్- 3 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు శీతల్ దేవి, శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైంది. ఈ జట్టులో పారా అథ్లెట్ అయిన శీతల్ చోటు దక్కించుకోవడం చరిత్రాత్మకం. శారీరక సామర్థ్యం ఉన్న జూనియర్ జట్టుకు ఎంపికైన మొదటి భారతీయ పారా ఆర్చర్‌గా కూడా ఆమె ఘనత సాధించింది. ఈ మేరకు శీతల్ సోషల్ మీడియాలో ఆనందం వ్యక్తం చేసింది. "నేను విలు విద్య ప్రారంభించినప్పుడు, నాకు ఒక కల వచ్చింది. ఏదో ఒక రోజు నేను ఉత్తమ ఆర్చర్లతో పోటీ పడాలనుకున్నాను. నేను నా శాయశక్తులా ప్రయత్నించాను. కానీ, నేను నా కలను ఎప్పుడూ వదులుకోలేదు. ప్రతి ఓటమి నుంచి నేను పాఠాలు నేర్చుకున్నాను. ఫలితంగా ఈ రోజు నా కల నిజమైంది" అని శీతల్ దేవీ పోస్టులో రాసుకొచ్చింది. హరియాణాలోని సోనిపట్‌లో రీసెంట్?గా జరిగిన జాతీయ ఎంపిక ట్రయల్స్‌లో 18ఏళ్ల శీతల్ పోటీ పడింది. దాదాపు 60 మందికి పైగా ఉత్తమ ఆర్చర్లతో పోటీపడిన ఆమె మూడో స్థానం దక్కించుకుంది. అర్హత రౌండ్‌లో ఆమె మొత్తం 703 పాయింట్లు (352 ం 351) సాధించింది. 15.75 అదనపు పాయింట్లతో తేజల్ మొదటి స్థానం, వైదేహి జాదవ్ 15 పాయింట్లతో రెండవ స్థానంలో నిలిచింది. 11.75 పాయింట్లతో శీతల్ మూడో స్థానంలో దక్కించుకుంది. మహారాష్ట్రకు చెందిన జ్ఞానేశ్వరి గాధే (11.5) నాలుగో స్థానంలో నిలిచింది.

# బంగ్లాదేశ్ మాజీ సెలెక్టర్ వల్లే కెరీర్ నాశనమైంది

**మంజురుల్ ఇస్లాం నన్ను లైంగికంగా వేధించాడు**

**తన కోరిక తీర్చకపోవడంతోనే అవకాశాలు రాలేదు**

**బంగ్లాదేశ్ మహిళా క్రికెటర్ సంచలన ఆరోపణలు**



బంగ్లాదేశ్ మహిళా క్రికెటర్ జహనారా ఆలమ్ సంచలన ఆరోపణలు చేసింది. బంగ్లాదేశ్ మాజీ సెలెక్టర్ మంజురుల్ ఇస్లాం తనను లైంగికంగా వేధించాడని ఆరోపించింది. ఆయన కోరిక తీర్చకపోవడంతోనే తన కెరీర్ నాశనమైందని చెప్పుకొచ్చింది. ఓ యూట్యూబ్ ఛానెల్ వేదికగా జహనారా ఆలమ్ చేసిన ఈ వ్యాఖ్యలు బంగ్లాదేశ్ క్రికెట్‌లో ప్రకంపనలు సృష్టించింది.'బంగ్లాదేశ్ క్రికెటర్‌గా నేను ఒకసారి కాదు.. చాలా సార్లు అసభ్యకరమైన ప్రతిపాదనలు ఎదుర్కొన్నా. మేం జట్టులో ఉన్నప్పుడు చాలా విషయాల గురించి మాట్లాడలేం. నిరసన కూడా తెలియజేసే అవకాశం ఉండదు. బంగ్లాదేశ్ బోర్డ్‌లోని చాలామంది సీనియర్ అధికారుల మద్దతు కోరడానికి ప్రయత్నించాను. మహిళా కమిటీ ఛైర్‌పర్సన్ నాదెల్ చౌదరి, బీసీబీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ నిజాముద్దీన్ చౌదరి దృష్టికి కూడా తీసుకెళ్లా. కానీ ఎలాంటి ఫలితం దక్కలేదు. రెండో ప్రతిపాదన 2022 ప్రపంచకప్ సమయంలో మంజు భాయ్ లైంగికంగా వేధించాడు. ఈ విషయాన్ని బోర్డు దృష్టికి కూడా తీసుకెళ్లాను. అయితే వారు తాత్కలిక పరిష్కారాన్ని చూపేవారు. మా ప్రీ క్యాంప్ సమయంలో మంజురుల్ ఇస్లామ్ అసభ్యకరంగా తాకేవాడు. ఇతర మహిళా క్రికెటర్లతోనూ అతను ఇలాగే వ్యవహరించేవాడు. షేక్ హ్యాండ్ సమయంలోనూ అనుచితంగా ప్రవర్తించేవాడు. నా నెలసరి గురించి కూడా ఇబ్బందికరమైన ప్రశ్నలు వేసేవాడు.'అని జహనారా ఆలమ్ చెప్పుకొచ్చింది. బంగ్లాదేశ్ మహిళా కెప్టెన్.. యువ ప్లేయర్లపై చేయి చేసుకుంటుందని కూడా జహనారా ఆరోపించింది. ఈ ఆరోపణలను మంజురుల్ ఇస్లాంతో పాటు బీసీబీ ఖండించింది. జహనారా ఆలమ్ మానసిక స్థితి బాలేక గతంలో ఆటకు బ్రేక్ ఇచ్చిందని గుర్తు చేసింది. అయితే ఈ లైంగిక ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరుపుతామని పేర్కొంది.




# రాజమౌళి మార్క్ విలన్.. భయపెడుతున్న 'కుంభ' ఫస్ట్ లుక్!

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న కాంబినేషన్ ఎస్.ఎస్. రాజమౌళి–సూపర్ స్టార్ మహేశ్ బాబు. వీరిద్దరి కలయికలో రాబోతున్న భారీ చిత్రం 'ఎస్ఎస్ఎంబీ29' (వర్కింగ్ టైటిల్) నుంచి ఓ క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న మలయాళ స్టార్ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ 'కుంభ' అనే పాత్రలో కనిపించనున్నారు. విడుదలైన పోస్టర్‌లో ఆయన లుక్ అత్యంత క్రూరంగా, భయంకరంగా ఉంది. దీన్ని బట్టి చూస్తే, ఈ చిత్రంలో మహేశ్ బాబుకు దీటైన ప్రతినాయకుడిగా పృథ్వీరాజ్ నటించనున్నట్లు స్పష్టమవుతోంది. ఆయన పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ఫస్ట్ లుక్‌తోనే రాజమౌళి చెప్పకనే చెప్పారు. ఈ నెల 15న ఈ సినిమాకు సంబంధించి 'గ్లోబ్ ట్రాటర్' పేరుతో ఓ భారీ ఈవెంట్‌ను నిర్వహించడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఈ ఈవెంట్‌లో సినిమా టైటిల్ లేదా ఇతర వివరాలు వెల్లడిస్తారని అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఆ ఈవెంట్‌కు ముందే ఇలా సడన్‌గా ఫస్ట్ లుక్‌ను విడుదల చేసి రాజమౌళి అందరికీ పెద్ద సర్‌ప్రైజ్ ఇచ్చారు. ఈ ఒక్క లుక్‌తో సినిమాపై ఉన్న అంచనాలు రెట్టింపయ్యాయి.




# 'పెద్ది' నుంచి 'చికిరి' సాంగ్ వచ్చేసింది..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది' నుంచి అభిమానులకు అదిరిపోయే ట్రీట్ అందింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'చికిరి చికిరి' పాట పూర్తి వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. కేవలం లిరికల్ వీడియో కాకుండా నేరుగా పూర్తి వీడియో సాంగ్‌ను విడుదల చేయడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. ఈ పాటలో రామ్ చరణ్ వేసిన హుక్ స్టెప్స్ సింప్లీ సూపర్బ్ అనే చెప్పాలి. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో రామ్ చరణ్ 'పెద్ది' అనే పాత్రలో కనిపించనుండగా, ఆయన సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. తాజాగా విడుదలైన పాటలో, తన ప్రేయసి 'చికిరి'ని ఊహించుకుంటూ 'పెద్ది' కొండ అంచున నిలబడి నృత్యం చేసే సన్నివేశాలను అద్భుతంగా చిత్రీకరించారు. "ఆ చంద్రుల్లో ముక్క జారిందే దీనక్క... నా ఒళ్లంతా ఆడిందే తైతక్కా" అంటూ సాగే సాహిత్యం మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తోంది. సాధారణ ఫ్యాంటు, షర్టు ధరించి మెడలో కర్చీఫ్ కట్టుకుని చరణ్ వేసిన సిగ్నేచర్ స్టెప్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. మోహిత్ చౌహాన్ గాత్రం ఆకట్టుకుంది. "కాటుక అక్కర్లేని కళ్లు... అలంకరణ అక్కర్లేని అరుదైన నా చికిరి" వంటి పంక్తులు సాహిత్యం విలువలను చాటిచెబుతున్నాయి. 'ఉప్పెన' ఫేం బుచ్చిబాబు సాన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, మీర్జాపూర్ ఫేం దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది.


# అనసూయ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్!?

ఒక్కసారిగా అనసూయ మళ్ళీ హాట్ టాపిక్ అయింది. అందుకు ప్రధాన కారణం ఓ వీడియో సాంగ్. ప్రభుదేవా, రాయ్ లక్ష్మీ, అనసూయ భరద్వాజ్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వోల్ఫ్' మళ్లీ వార్తల్లో నిలిచింది. 2023 ఆగస్టులో టీజర్‌ను విడుదల చేసిన ఈ చిత్ర బృందం, ఇన్నాళ్ల విరామం తర్వాత తాజాగా ఓ కొత్త అప్డేట్ ఇచ్చింది. తాజాగా విడుదలైన "సాసా సాసా" అనే తమిళ లిరికల్ వీడియో సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పాటలో ప్రభుదేవా తన సొగసైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకుంటూ కనిపిస్తారు. ఓ ఇంట్లో ఒంటరిగా ఉన్న హీరో జీవితంలో ముగ్గురు అందమైన యువతులు ఒక్కొక్కరిగా ప్రవేశించడం, వారంతా చాటుగా మొబైల్‌లో వీడియోలు తీయడం, హీరోను ఆటపట్టించడం వంటి రొమాంటిక్ సన్నివేశాల మధ్య ఈ పాట సాగుతుంది. మెలోడీకి తోడు స్టైలిష్ విజువల్స్, ప్రభుదేవా ఎనర్జిటిక్ డ్యాన్స్ ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్‌గా మారాయి. ఇప్పటికే ఈ త్రీసమ్ రొమాంటిక్ సాంగ్ యువతలో విపరీతంగా వైరల్ అవుతోంది. ప్రెజెంటేషన్‌లో ఉన్న క్లాస్ టచ్, సంగీతంలో ఉన్న మోడర్న్ బీట్‌లు ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి. అయితే అనసూయ భరద్వాజ్ ఇలాంటి సాంగ్‌లో నటించడం కొంతమందిని ఆశ్చర్యపరిచింది. ఆమె ఓ తాంత్రికురాలి పాత్రలో కనిపించబోతున్నారని, ఆ రోల్ హర్రర్%–%రోమాన్స్ మిక్స్‌గా ఉంటుందని సమాచారం. అయినా, నెటిజన్లు "ఇలాంటి పాత్రలో అనసూయ ఎందుకు నటించింది?" అంటూ సోషల్ మీడియాలో విభిన్న కామెంట్లు చేస్తున్నారు. కొంతమంది ఆమెపై వ్యంగ్యంగా ట్వీట్లు చేస్తుండగా, మరికొందరు మాత్రం ఆమె కొత్త ప్రయోగాన్ని మెచ్చుకుంటున్నారు. ఏదేమైనా, "సాసా సాసా" పాటతో ఈ సినిమా మీద మళ్లీ చర్చ మొదలైంది. వినూ వెంకటేష్ దర్శకత్వంలో రూపొందిన 'వోల్ఫ్' చిత్రం ప్రభుదేవా కెరీర్‌లో 60వ సినిమాగా నిలవబోతోంది. సందేశ్ నాగరాజు, సందేశ్ ఎన్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే తమిళంతో పాటు తెలుగు మరియు ఇతర భాషల్లో విడుదల కానుంది.



# భూత వేటగాడిగా ఆకట్టుకున్న సుదీర్ బాబు

సుదీర్ బాబు, సొనాక్షి సిన్హా నటించిన 'జటాధర' సినిమాపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ధన పిశాచిని పాత్రలో సొనాక్షి చేసిన నటన ఈ చిత్రానికి ప్రధాన హైలైట్‌గా నిలిచిందని ప్రేక్షకులు అంటున్నారు. భూత వేటగాడిగా సుదీర్ బాబు తీవ్రతతో కూడిన ప్రదర్శనను అందించి ఆకట్టుకున్నారు. కథలో పౌరాణికత, భావోద్వేగం, భయం సమతూకంగా మిళితమైందని, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా వాతావరణాన్ని మరింత బలవంతం చేసిందని స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. సినిమా పూర్తయ్యాక కూడా కథ ఇమేజ్ మైండ్‌లో నిలిచిపోతుందని నెటిజన్లు పేర్కొంటున్నారు. థియేటర్‌లో చూస్తూనే ఈ అనుభూతిను ఎక్స్‌పీరియన్స్ చేయగలరని అంటున్నారు.సుధీర్ బాబు హీరోగా, బాలీవుడ్ బ్యూటీ సొనాక్షి సిన్హా కీలక పాత్రలో నటించిన సూపర్ నేచురల్ మైథలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ ' జటాధర '. వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో శుక్రవారం (నవంబర్ 7) ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఘోస్ట్ హంటింగ్, బ్లాక్ మ్యాజిక్, మైథలాజికల్ ఎలిమెంట్స్ అన్నీ కలగలిపి ఈ చిత్రాన్ని తీసినట్లు ప్రమోషన్లలో మేకర్స్ చెబుతూ వచ్చారు. సుధీర్‌బాబు నటన బ్యాలెన్స్‌గా ఉంది. ఆయనకు, సొనాక్షి మధ్య వచ్చే సీన్లు స్క్రీన్‌పై ఎనర్జీతో నిండిపోయాయి. ఈ కథ 'భక్తి – శక్తి' మధ్య జరిగే పోరును లోతుగా చూపించింది. సినిమా చూస్తున్నప్పుడు కనీసం ఒక్క క్షణం కూడా దృష్టి మళ్లించడం కష్టమే. 'జటాధర' సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను కట్టిపడేసే అనుభవాన్ని ఇస్తుంది. సొనాక్షి సిన్హా పోషించిన 'ధన పిశాచి' పాత్ర ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇప్పటివరకు చేసిన పాత్రల్లో ఒక అత్యంత ప్రభావవంతమైన పాత్రగా నిలుస్తుంది. రొమాంటిక్ పాత్రల నుండి డార్క్ హారర్ పాత్రకి ఆమె తీసుకున్న ఛేంజ్ స్క్రీన్‌పై అద్భుతంగా కనిపించింది. ధన పిశాచిగా సొనాక్షి, భూత వేటగాడిగా సుధీర్‌బాబు పోటాపోటీగా నటించి గూస్‌బంప్స్ తెప్పించారు. సుధీర్‌బాబు లుక్, యాక్టింగ్ మెప్పించేలా ఉంది. స్క్రీన్‌ప్లే టైట్‌గా ఉంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకుల్ని భయపెడుతూ హారర్ వాతావరణాన్ని మరింత వేడెక్కించేలా ఉంది. బ్లాక్ మ్యాజిక్‌పై సందేశాన్ని చూపించినా ఎక్కడా బోర్ కొడుతున్నట్లు అనిపించదు. మొత్తానికి, 'జటాధర' థియేటర్‌లో చూడటానికి పర్ఫెక్ట్ మూవీ. ఈ సినిమా కేవలం హారర్ మాత్రమే కాదు.. మనుషుల మనసుల్లో పాతుకుపోయిన లోభం, ఆశ, ధర్మం, న్యాయం లాంటి భావాలను తాకుతుంది. కథనం సహజంగా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత కూడా దాని ప్రభావం మనసుని వెంటాడుతూ ఉంటుంది. పౌరాణికం, భావోద్వేగం, హారర్ ఈ మూడింటినీ అద్భుతంగా మిళితం చేసిన చిత్రం ఇది. లోభం వర్సెస్ త్యాగం అనే అంశం బలంగా తాకుతుంది. సొనాక్షి సిన్హాకి చాలాకాలం పాటు గుర్తుండిపోయే పాత్ర ఇది. ఈ సినిమాను భారీ బడ్జెట్, హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో తెరకెక్కించినందుకు మేకర్స్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. దర్శకులు వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ భారతీయ ఆధ్యాత్మికత, పౌరాణికతను ఆధునిక హారర్ షేడ్‌లో చూపించారని కొనియాడుతున్నారు. మొదటి ఫ్రేమ్ నుంచే సినిమాలో టెన్షన్ పెరిగిపోతుందని,. సుధీర్ బాబు పోషించిన 'శివ' పాత్ర శాపం, 'ధన పిశాచిని'తో అనుబంధమైన రహస్యాలను అన్వేషించే గమనంలో సాగిందని చెబుతున్నారు.క్లైమాక్స్‌లో సుధీర్ బాబు ప్రదర్శన కెరీర్ బెస్ట్‌గా నిలిచిందని అంటున్నారు. సొనాక్షి యాక్టింగ్ భయంకరంగా, ఆకర్షణీయంగా, చెరగని ముద్ర వేసిందని చెబుతున్నారు. బీజీఎం, విజువల్ ఎఫెక్ట్స్, ప్రొడక్షన్ డిజైన్ అన్నీ టాప్ క్లాస్‌గా ఉన్నాయని ప్రశంసలు కురిపిస్తున్నారు. మొత్తానికి 'జటాధర' సూపర్ నేచురల్ యాక్షన్ థ్రిల్లర్‌తో తెలుగు సినిమాల్లో ప్రత్యేక స్థానం దక్కించుకోవడం ఖాయమని చూసిన వారు చెబుతున్నారు. చాలామంది నెటిజన్లు ఈ చిత్రానికి ఐదుకు గాను నాలుగు పాయింట్లు ఇస్తూ సూపర్ బ్లాక్‌బస్టర్ అంటూ తెగ పొగిడేస్తున్నారు. మొత్తానికి సుధీర్‌బాబు చాలాకాలం తర్వాత బ్లాక్‌బస్టర్ అందుకున్నాడని కామెంట్లు చేస్తున్నారు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

- కొనుగోలు లో ఆలస్యం ఉండద్దు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం నవంబర్07( సమయం న్యూస్). :** రఘునాథ్ పల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఆకస్మికం గా సందర్శించారు ఈ సందర్భంగా కలెక్టర్... కేంద్రం లో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్ లను పరిశీలించి... ఎప్పటికప్పుడు వచ్చే ధాన్యం వివరాలను అలాగే కొనుగోలు అయిన వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు

అకాల వర్షాల నేపథ్యంలో..తేమ వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా కొనుగోలు చేసి... ట్యాగ్ చేసిన మిల్లు లకు తరలించాలన్నారుసరిపడా టార్పాలిన్ లను అందుబాటులో పెట్టుకోవాలని...వర్షం వచ్చే సూచనలు తెలిసినప్పుడు కేంద్రం లో ఉన్న ధాన్యం తడవకుండా వెంటనే తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు ఈ పరిశీలన లో కలెక్టర్ వెంట మండల తహసీల్దార్ ఫణి కుమార్ పాల్గొన్నారు

# ఎంపీడీఓ కార్యాలయంలో వందేమాతరం గీతం ఆలాపన



**కొడంగల్, నవంబర్,07(సమయం న్యూస్) :** వందేమాతరం గీతం ఆలాపన జరిగి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మండల ప్రజా పరిషత్ వికారాబాద్ జిల్లా కొడంగల్ కార్యాలయం నందు గీతాలాపనచేసిన ఏపీఓ రాములు, సీనియర్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరెడ్డి, వివిధ గ్రామాల క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు

# ఎర్రగుట్ట తాండలోడ్రైన్లను,సీసీ రోడ్లను,వీధి దీపాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



**మద్దూరు మున్సిపల్(మం)నవంబర్,07(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రగుట్ట తండాలో శుక్రవారం మార్నింగ్ వాక్ లో భాగంగా అక్కడ ఉన్నటువంటి డ్రైన్లను, సిసి రోడ్లను , వీధి దీపాలను పరిశీలించడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, జవాన్సు,ఎర్రగుంట తండా ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకోవాలి

- దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు- వెంకట్రావు



**దౌల్తాబాద్, మండలం, నవంబర్,07(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు కార్యకర్తలకు తెలియజేయునది ఏమనగా నేడు శనివారం నాడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు రేవంత్ రెడ్డి అభిమానులు ఉదయం 8:00 గంటలకు దౌల్తాబాద్ మండల కేంద్రం అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలలో పాల్గొని ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకొని అక్కడినుండి హైదరాబాద్ కు తిరుపతి రెడ్డి కూతురు వివాహానికి హాజరు కావాలని కోరారు.

# రైతులకు ఆధునిక పంటల వైపు మళ్లించడం లో ఎరువుల షాపు యాజమానులు క్రియాశీలంకంగా వ్యవహరించాలి.

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాల పల్లి నవంబర్07( సమయం న్యూస్).:** రైతాంగాన్ని ఆధునిక పంటలవైపు మళ్లించడంతో అవసరం మేర మందులు వినియోగంపై రైతులకు అవగహన కల్పించడలో ఫర్టిలైజర్ దుకాణం డీలర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం ఐడి ఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఇన్‌పుట్ డీలర్లకు నిర్వహించిన “దేశీ డిప్లమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ప్రోగ్రామ్”లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని ఇన్పుట్ డీలర్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు 6 బ్యాచ్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామాలలో పురుగుమందు దుకాణాలు నిర్వహించుకోవడాకి అవకాశం లభించిందని 7వ బ్యాచ్ లోని వ్యక్తులు సైతం వ్యవసాయ సైంటిస్టులచే నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు హాజరు కావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో కొత్త వరవడికలు నేర్చుకొని గ్రామీణ స్థాయిలో రైతాంగానికి వెన్నుదన్నుగా నిలవాలని స్పష్టం చేసారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వాడకం వంటి అంశాలపై సరైన అవగాహన కలిగించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఇన్‌పుట్ డీలర్లు రైతులకు నమ్మకమైన సమాచారం, నాణ్యమైన ఉత్పత్తులు అందించి వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.అలాగే వ్యవసాయ రంగం ఆధునికత వైపు దూసుకుపోతున్న ఈ కాలంలో, ప్రతి ఇన్‌పుట్ డీలర్ రైతుల మిత్రుడిగా, మార్గదర్శిగా వ్యవహరించాలని ఆయన




పేర్కొన్నారు.అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఔత్సాహిక డీలర్లు పాల్గొన్నారు.

# అరుదైన ఘనత సాధించిన 'భ్రమయుగం' చిత్రం

**హైదరాబాద్ నవంబర్ 07( సమయం న్యూస్).:** ఫిబ్రవరి 12, 2026న లాస్ ఏంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియంలో 'భ్రమయుగం' చిత్ర ప్రదర్శనఇటీవల ప్రకటించిన 55వ కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డులలో నాలుగు విభాగాల్లో సత్తా చాటిన 'భ్రమయుగం' చిత్రం, మరో అరుదైన ఘనతను సాధించింది. లాస్ ఏంజెల్స్‌లోని 'అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్'లో 'భ్రమయుగం' ప్రత్యేక ప్రదర్శనకు సిద్ధమైంది. నైట్ షిఫ్ట్ స్టూడియోస్ మరియు వైనాట్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ రచన, దర్శకత్వం వహించారు.ఈ ప్రదర్శన ఫిబ్రవరి 12, 2026న అకాడమీ మ్యూజియం యొక్క “వేర్ ది ఫారెస్ట్ మీట్స్ ది సీ: ఫోక్లోర్ ఫ్రమ్ ఎరౌండ్ ది వరల్డ్”(Where the Forest Meets the Sea: Folklore from Around the World) చిత్రోత్సవ శ్రేణిలో భాగంగా జరుగనుంది. ఈ కార్యక్రమం జనవరి 10వ తేదీ నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు కొనసాగుతుంది.రాహుల్ సదాశివన్ రచన మరియు దర్శకత్వం వహించిన 'భ్రమయుగం' చిత్రం, కేరళ జానపద కథల చీకటి యుగాల నేపథ్యంలో భయం, శక్తి మరియు మానవ బలహీనతలను ఆవిష్కరించిన గాఢమైన అన్వేషణ. ఈ చిత్రం బ్లాక్ % వైట్ ఫార్మాట్‌లో తెరకెక్కించబడింది. కట్టిపడేసే కథాకథనాలు, అద్భుతమైన సాంకేతికతతో ఈ చిత్రం విశేష ప్రశంసలు అందుకుంది.

'భ్రమయుగం' చిత్రంలో కొడుమోన్ పోట్టి అనే పాత్రలో లెజెండరీ నటుడు మమ్ముట్టి అద్భుతమైన నటన కనబరిచారు. అర్జున్ అశోకన్, సిద్ధార్థ్ భరతన్, అమల్దా లిజ్ ముఖ్య పాత్రల్లో నటించారు.ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: షెహనాద్ జలాల్ సంగీతం: క్రిస్టో జేవియర్, కళా దర్శకత్వం: జోతిష్ శంకర్, కూర్పు: షఫీక్ మొహమ్మద్ అలీ, సౌండ్ డిజైన్: జయదేవన్ చక్కదత్, సౌండ్ మిక్స్: ఎం.ఆర్. రాజకృష్ణన్, సంభాషణలు: టి.డి. రామకృష్ణన్, మేకప్: రోనెక్స్ జావియర్ % జార్జ్ ఎస్., ప్రోస్తేటిక్స్: ప్రీతిషీల్ సింగ్ డిసౌజా, దుస్తులు: మెల్వీ జె.

'భ్రమయుగం' గురించి, నైట్ షిఫ్ట్ స్టూడియోస్ గురించి

మమ్ముట్టి ప్రధాన పాత్రలో రాహుల్ సదాశివన్ రచన మరియు దర్శకత్వం వహించిన మలయాళ చిత్రం 'భ్రమయుగం'. హారర్-థ్రిల్లర్ జానర్ చిత్రాలను రూపొందించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా స్థాపించబడిన ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ నైట్ షిఫ్ట్ స్టూడియోస్ పతాకంపై తొలి చిత్రంగా 'భ్రమయుగం' తెరకెక్కించింది. వైనాట్ స్టూడియోస్‌తో కలిసి నైట్ షిఫ్ట్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మించింది.నైట్ షిఫ్ట్ స్టూడియోస్ బ్యానర్ లో రూపుదిద్దుకున్న తాజా చిత్రం 'డైస్ ఇరే' 2025 అక్టోబర్ 31న విడుదలైంది. ఇందులో ప్రణవ్ మోహన్‌లాల్ ప్రధాన పాత్ర పోషించారు. ఇది నైట్ షిఫ్ట్ స్టూడియోస్ లో తెరకెక్కిన రెండవ చిత్రం. 'భ్రమయుగం' దర్శకుడు మరియు ప్రధాన సాంకేతిక బృందం ఈ చిత్రానికి కూడా పని చేయడం విశేషం.'అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్' గురించిఅకాడమీ మ్యూజియం అనేది కళలు, శాస్త్రాలు మరియు చలనచిత్ర కళాకారులకు అంకితం చేయబడిన ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియం. ఈ మ్యూజియం ప్రదర్శనలు, కార్యక్రమాలు, సేకరణల ద్వారా సినిమా యొక్క అవగాహన, వేడుక మరియు సంరక్షణను ప్రోత్సహించడంలో ముందంజలో ఉంది. ప్రిట్జ్‌కర్ బహుమతి గ్రహీత ఆర్కిటెక్ట్ రెంజో పియానో రూపొందించిన ఈ మ్యూజియం, పునరుద్ధరించబడిన చారిత్రాత్మక సాబన్ బిల్డింగ్ (మునుపటి మే కంపెనీ బిల్డింగ్, 1939) మరియు గోళాకార నిర్మాణాన్ని కలుపుకుని ఉంటుంది. ఈ భవనాల్లో మొత్తం 50,000 చదరపు అడుగుల ప్రదర్శన స్థలాలు, రెండు అత్యాధునిక థియేటర్లు, షిర్లీ టెంపుల్ ఎడ్యుకేషన్ స్టూడియో మరియు ఉచిత అందమైన ప్రజా స్థలాలు ఉన్నాయి. అలాగే, 'వాల్ట్ డిస్నీ కంపెనీ పియాజ్జా' మరియు స్పీల్‌బర్గ్ ఫ్యామిలీ గ్యాలరీ, అకాడమీ మ్యూజియం స్టోర్ మరియు ఫ్యానీస్ రెస్టారెంట్ %డ% కేఫ్‌లను కలిగి ఉన్న 'సిడ్నీ పోయిటియర్ గ్రాండ్ లాబీ' ఉన్నాయి. అకాడమీ మ్యూజియం వారానికి ఆరు రోజులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

# చేవెళ్ల బస్సు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**చేవెళ్ల నవంబర్ 07( సమయం న్యూస్). :** ఇటీవల చేవెళ్ల సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో గాయపడిన బాధితులను జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె బాధిత కుటుంబాలపై సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రమాదానికి కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమని ఘాటుగా విమర్శించారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ౧ “చేవెళ్ల రోడ్డు ప్రమాదానికి కారణం ప్రభుత్వమే. రోడ్డు బాగు చేయించకపోవటంతోనే ఈ ప్రమాదం జరిగింది.” అని పేర్కొన్నారు.“ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. కోటి పరిహారం, గాయపడిన వారికి రూ. 10 లక్షలు చెల్లించాలి.” అని డిమాండ్ చేశారు.

“నేషనల్ హైవే-163 రోడ్డు బాగు చేయాలని స్థానికులు పదే పదే కోరుతున్నారు. రోడ్డు పరిస్థితి దారుణంగా ఉందని చెప్పి ధర్నా చేసిన వారికి కేసులు పెట్టడం విచారకరం. వెంటనే ఆ కేసులు వెనక్కి తీసుకోవాలి.”

“పర్యావరణ అంశాలు అని చెప్పి రోడ్డును రిపేర్ చేయకపోయారు. ఇప్పుడు నావల్ రాడార్‌కు అనుమతి ఇచ్చారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం రాడార్ కేంద్రానికి అనుమతి ఇవ్వలేదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం రోడ్డు పరిస్థితిపై పట్టించుకోవడం లేదు. భారీ లోడుతో వాహనాలు ఈ రోడ్డుపై నిత్యం ప్రయాణిస్తున్నాయి. దీంతో రోడ్డు పూర్తిగా కుంగిపోయింది. ఈ నిర్లక్ష్యమే ప్రజల ప్రాణాలు తీస్తోంది.”

“ఈ రోడ్డుపై గత కొన్నేళ్లుగా జరిగిన ప్రమాదాల్లో దాదాపు 300 మంది ప్రాణాలు కోల్పోయారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. గాయపడిన వారు ఎక్కువగా రోజువారీ కూలీలు. వారికి జీవనోపాధి కష్టంగా మారింది. ఇప్పటి వరకు ప్రకటించిన రూ. 2 లక్షల సాయం కూడా అందలేదని బాధితులు చెబుతున్నారు. కనీసం రూ. 10 లక్షలు ఇవ్వాలి.”మరింతగా ఆమె రోడ్ కాంట్రాక్ట్ సంస్థపై కూడా మండిపడ్డారు “రోడ్ కాంట్రాక్ట్ సంస్థ 'మేఘ' వారు రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలి. ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. బాధితులకు సరైన పరిహారం ఇవ్వకపోతే ప్రజలు ఆగ్రహంతో రోడ్డెక్కే పరిస్థితి వస్తుంది.

# గిరిజన నిరుద్యోగ యువత కు ట్రైకార్ ద్వారా ఉపాధి అవకాశాలు.

ఐటి డి ఏ పి ఓ .

**మహబూబాబాద్ నవంబర్ 07 ( సమయం న్యూస్).**

గిరిజన సంక్షేమ శాఖా (ట్రైకార్), తెలంగాణ ప్రభుత్వం వారు గిరిజన నిరుద్యోగ యువతీ, యువతులకు ఉద్యోగులుగా మార్చేందుకు వారికీ తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ వారితో కలిసి ఒక డిజిటల్ ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఇట్టి డిజిటల్ ప్లాట్ ఫామ్ నిరుద్యోగులకు మరియు ఉద్యోగం కల్పించే పరిశ్రమలకు ఒక వారధిగా పనిచేస్తుందని, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ, ఎటురునాగారం, ప్రాజెక్టు అధికారి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యు-ువతీ, యువకులు వెబ్ సైట్:- http//deet.telan-gana.gov.in వెబ్ సైట్ లో తమ యొక్క పేర్లు నమోదు చేసుకున్నట్లయితే వారి యొక్క విద్య అర్హతను బట్టి ఉద్యోగం కల్పించబడునని మరియు DEET app ను ప్లే స్టోర్ ద్వారా వారియొక్క మొబైల్ లో డౌన్ లోడ్ చేసుకుని రిఫరల్ కోడ్: JSETNఅని టైపు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోగలరని, తద్వారా దాదాపు 900 కంపెనీలలో ఉద్యోగావకాశాలు పొందగల్గుతారని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు దేశీరాం పేర్కొన్నారు.